నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
మంగళవారం జనవరి 28, 2025 www.navatelangana.com

మాఘమావస్యకు ముస్తాబైన మద్దికుంట ఆలయం



నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని మద్దికుంట లో వెలసిన శ్రీ స్వయంభు బుగ్గ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం మాఘమాస్య సందర్భంగా ఆలయంలో భక్తుల కోసం ఏర్పాట్లను పూర్తి చేశారు. మండలంతో పాటు పలు జిల్లాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొననున్నందున కామారెడ్డి పట్టణం నుండి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతున్నది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆలయం వద్ద గల పుష్కరనిలో స్నానాలు ఆచరించి, స్వామివారి కృపకు పాత్రులు కాగలరని ఆలయ కమిటీ, ఆలయ పూజారులు కోరారు.

సోయా కొనుగోలు చేపట్టాలి

మార్క్‌ఫెడ్ చైర్మన్‌ను కలిసిన ఎమ్మెల్యే, రైతులు



నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మార్కెట్ యార్డులో కొనుగోలు జరగకుండా భారీ మొత్తంలో సోయా పంట నిల్వ ఉన్న వాటిని కొనుగోలు జరపాలని జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మీ కాంతారావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు రైతులు ఎమ్మెల్యే వెంట హైదరాబాద్ కు తరలి వెళ్లి సోమవారం రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డిని కలిసి విన్నవించారు. మార్కెట్ యార్డులో నిల్వ ఉన్న సోయా పంట కొనుగోలు జరపాలని ఎమ్మెల్యే ప్రత్యేకంగా చైర్మన్ ను కోరారు రైతుల విజ్ఞప్తి మేరకు మిగిలి ఉన్న పంట కొనుగోలు జరపడానికి సహకరిస్తానని మార్కెఫెడ్ చైర్మన్ హామీ ఇచ్చినట్లు రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట మద్నూర్ సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్ పటేల్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పరమేష్ పటేల్, మద్నూర్ ఉమ్మడి మండలాల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు రైతులు తదితరులున్నారు.



సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభల్లో జిల్లా నివేదికను ప్రవేశపెడుతున్న పార్టీ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

ప్రజాసంఘాల ఉద్యమాలు పెంచుకున్నాం

- పోరాటాలతో పలు విజయాలు సాధించాం
- సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభల్లో జిల్లా నివేదికను వివరించిన పార్టీ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా గతంతో పోలిస్తే ప్రజా సంఘాల ఉద్యమాలు పెంచుకున్నామని, పలు పోరాటాలతో విజయాలు సాధించినట్టు సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ తెలిపారు. సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలు సంగారెడ్డిలో సోమవారంతో మూడవ రోజుకు చేరాయి. సభలో కామారెడ్డి జిల్లా రాజకీయ పరిస్థితులు, పార్టీ కార్యక్రమాల గురించి ప్రతినిధుల అభిప్రాయాన్ని మహాసభకు జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ వివరించారు. ఆ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కామారెడ్డి జిల్లాలో గతం కంటే ప్రజా సంఘాల ఉద్యమంపెరిగిందని, జిల్లాలో పోడు భూములు, ఇండ్ల స్థలాలు పోరాటాలు ప్రజా సంఘం ఆధ్వర్యంలో విజయాలు సాధించామన్నారు. కామారెడ్డి జిల్లాలో బలమైన ఉద్యమం నిర్మించాల్సిన అవసరం ఉందని, జిల్లాలో వేల ఎకరాల ఆసైండ్ భూమి అన్యాక్రాంతమైందని ఇంకా జిల్లాలో రైతులు, కార్మికులు, కర్షకుల సమస్యలపై ప్రధానంగా జిల్లాలో బీడీ పరిశ్రమలో దోపిడీ చేస్తున్న బీడీ కంపెనీ దేశాయితో పాటు అన్ని కంపెనీల పై రాజీలేని పోరాటాలను రూపకల్పన చేసుకుంటామన్నారు. ఈ సభలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వెంకట్ గౌడ్, కొత్త నరసింహులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో ప్రక్షాళన



- త్వరలో జిల్లా అధ్యక్షుడి మార్పు..?
- జిల్లాలో పూర్వవైభవమే లక్ష్యంగా అడుగులు
- వేములకు అవకాశం ఇచ్చే ఛాన్స్!

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లాలో పార్టీ క్యాడర్‌ను కాపాడుకోవడంతో పాటు పార్టీకి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు బీఆర్ఎస్ పార్టీ ప్రక్షాళన చేపడుతున్నట్టు సమాచారం. పాలకుల వైఫల్యాలను ఎండగట్టేందుకు ప్రజలతో కలిసి పోరాటాలకు సిద్ధమవడంతో పాటు అటు స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా పావులు కదుపుతున్నట్టు సమాచారం. ఇందుకోసం జిల్లాలో నాయకత్వ మార్పు జరిగే అవకాశం ఉన్నట్టు వినికిడి. జిల్లాలో పార్టీ అధ్యక్షుడిని మార్చి మరొకరికి బాధ్యతలు అప్పగించే అవకాశాలున్నట్టు సమాచారం.

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా.. గతంలో బీఆర్ఎస్‌కు కంచుకోటగా ఉండేది. అయితే గత అసెంబ్లీ ఎన్నికల్లో ఘోరంగా పరాభవం చెందింది. 9 సిట్టింగ్ స్థానాల్లో పోటీ చేస్తే.. కేవలం బాన్సువాడ, బాల్కొండలో రెండు చోట్లనే గెలుపొందింది. అయితే వీటిల్లోనూ బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం.. అధికార పార్టీలో చేరడంతో ప్రస్తుతం బీఆర్ఎస్ ఖాతాలో ఒక్క సీటు మాత్రమే ఉంది. దీంతో పార్టీకి పునర్వైభవం తీసుకువచ్చేందుకు ఆ పార్టీ అధిష్టానం ప్రక్షాళన చేసేందుకు సిద్ధమైనట్టు సమాచారం. బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులుగా ఆశన్నగారి జీవన్‌రెడ్డి 2022 ఫిబ్రవరి నుంచి కొనసాగుతున్నారు. ఎంపికైన సమయంలో జీవన్‌రెడ్డి.. ఇటు ఆర్మూర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా, అటు పీయూసీ చైర్మన్‌గా బాధ్య తలలో ఉండిపోయారు.



మొక్కు బడిగా కార్యక్రమాలు

అయితే రాష్ట్రంలో అధికారం కాంగ్రెస్ పార్టీ చేపట్టి ఇప్పటికే ఏడాది పూర్తయింది. అయితే ఇచ్చిన హామీల అమలు, సమస్యల పరిష్కారానికి ప్రజలతో కలిసి పెద్దఎత్తున నిరసనలు చేపట్టడం లేదని పార్టీలోని కార్యకర్తల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కనీసం పాలకుల వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగట్టడం లేదని, దీంతో పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని పార్టీలో అంతర్గతంగా చర్చలు నడుస్తున్నాయి.

కవిత రాకతో శ్రేణుల్లో జోష్

ఇటీవల వరకు స్తబ్దుగా ఉన్న పార్టీ శ్రేణులకు.. కవిత వరుసగా జిల్లా పర్యటనలు చేస్తుండటంతో కొంత మేర జోష్ కనిపించింది. లిక్కర్ కేసులో జైలు నుంచి విడుదలైన తర్వాత ఇటీవల కాలంలో నిజామాబాద్ జిల్లాకు తరుచూ వస్తున్నారు. ఎప్పటికప్పుడు విమర్శనాస్త్రాలు సంధించారు.

వేములకు ఛాన్స్ ఇచ్చే అవకాశం..

ప్రభుత్వాన్ని ఎండగట్టే ధోరణి లేకపోవడం, దానికి తోడు ఎప్పుడు రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాల పైన కానీ ఇతరత్రా ప్రజా సమస్యల పైన ఏనాడు జిల్లా అధ్యక్షుడు గొంతెత్తి ప్రశ్నించిన దాఖలాలు లేవు. ఇప్పుడున్న తరుణంలో పార్టీని బలోపేతం చేయడం.. ప్రజల్లోకి తీసుకెళ్లడం అనే అంశాలను ముందుండి నడుపుటకు ఓ బలమైనా నాయకుడు కావాలని ఆలోచనతో.. బీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కేసీఆర్.. స్వయంగా ప్రస్తుతం ఉన్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు సమక్షంలోనే మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డిని కూర్చోబెట్టుకుని సమీక్షించినట్టు సమాచారం. త్వరలోనే నాయకత్వ మార్పు ఉంటుందని చెప్పినట్టు వినికిడి. వేముల ప్రశాంత్‌రెడ్డికి ఛాన్స్ ఇచ్చే అవకాశాలున్నట్టు పార్టీలో అంతర్గతంగా చర్చ నడుస్తుంది. రానున్న ఏప్రిల్ నెలలో వరంగల్‌లో బీఆర్ఎస్ పార్టీ ప్లీనం ఏర్పాటు చేయనున్నారని, అప్పటి లోగా జిల్లా అధ్యక్షుడు ఖరారు అయ్యే అవకాశాలు ఉన్నాయి. రానున్న కొత్త అధ్యక్షుడు.. పార్టీని జిల్లాలో ఏ విధంగా బలోపేతం చేస్తాడో వేచి చూడాల్సిందే.

సమావేశం పేరుతో.. పదవీ విమరణ వేడుక

- విద్యార్థులకు పాఠాలు చెప్పకుండా హాజరైన పలువురు ఉపాధ్యాయుల తీరుపై విమర్శలు



నవతెలంగాణ-కామారెడ్డి

విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సిన సమయంలో ఉపాధ్యాయుని పదవి విరమణ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొనడం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పాఠశాలలు కొనసాగే సమయంలో సమావేశం పేరుతో పదవి విరమణ కార్యక్రమాన్ని నిర్వహించడం దానికి ఉపాధ్యాయులు అధిక మొత్తం హాజరు కావడం పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇది మండల విద్యాశాఖ అధికారి కను సన్నల్లోనే జరుగుతుందా, తమను ఆపేవారు ఎవరూ లేరని ఆలోచనతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారా ? అని విద్యార్థి సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. నీతులు చెప్పే వారే ఇలా విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసే వారికి వంత పాడడం ఎంతవరకు సరియైనదో సదరు ఉపాధ్యాయులే ఆలోచించుకోవాల్సి ఉంది.

పదవి విరమణ కార్యక్రమాలు నిర్వహించుకోవడం తప్పుకాదు చాలా బ్రహ్మాండంగా నిర్వహించుకోవాలి, కానీ అది సెలవు రోజు నిర్వహించుకుంటే బాగుంటుంది లేదా మూడు గంటల తర్వాత నిర్వహించుకుంటే బాగుంటుందేమో అని ఒక సగటు ఉపాధ్యాయుడి చిన్న సందేహం అని సోషల్ మీడియాలో వైరల్ చేశారు.

మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపాలి

- జిల్లా కమిటీ సమావేశంలో కలెక్టర్ ఆదేశం
- డీ అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేయాలని నిర్ణయం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

గంజాయి, క్లోరోఫామ్, అల్ప్రాజోలం వంటి మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల నిరోధానికి సంబంధిత శాఖల అధికారులు కలిసికట్టుగా కృషి చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదేశించారు. మత్తు పదార్థాల రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపుతూ, నిరంతరం నిఘాను కొనసాగించాలని అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ అధ్యక్షతన సోమవారం జిల్లా స్థాయి మాదకద్రవ్యాల నిరోధక కమిటీ సమావేశం నిర్వహించారు. బోధన్, అర్బన్ ఎమ్మెల్యేలు పి.సుదర్శన్ రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ హాజరై, జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, రవాణా తదితర అంశాలపై కూలంకషంగా చర్చించారు. వాటి నియంత్రణకు చేపట్టాల్సిన చర్యల గురించి పోలీస్, ఎక్సయిజ్, ఔషధ నియంత్రణ మండలి అధికారులకు కలెక్టర్, ఎమ్మెల్యేలు సూచనలు చేశారు. నిజామాబాద్ ను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లాలో గంజాయి సాగు లేనప్పటికీ ఆంధ్ర, ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుండి నిజామాబాద్ మీదుగా గంజాయిని అడపాదడపా మహారాష్ట్రకు స్మగ్లింగ్ చేస్తున్నందున గట్టి నిఘా ఉంచాలన్నారు. ముఖ్యంగా రోడ్డు, రైలు మార్గాల ద్వారా వీటిని రవాణా చేసే అవకాశాలు ఉన్నందున ఆర్టీసీ, రైల్వే అధికారులతో సమన్వయము పెంపొందించుకుని నిరోధక చర్యలు చేపట్టాలని, తనిఖీ కేంద్రాల వద్ద గట్టి నిఘా ఉంచాలని అన్నారు. గంజాయి విక్రేతలను, దానిని వినియోగించే వారిని గుర్తించి కఠిన శిక్ష పడేలా కోర్టులకు సమగ్ర ఆధారాలు సమర్పించాలన్నారు. కల్తీ కల్లు తయారీ కోసం వినియోగించే అల్ప్రాజోలం నిల్వలను వెలికితీయాలని, మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి ప్రజలకు వివరిస్తూ విస్తృతస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. ముఖ్యంగా విద్యార్థులు వీటికి అలవాటుపడకుండా ఉండేందుకు వీలుగా కళాశాలల్లో క్రమం తప్పకుండా అవగాహన సదస్సులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. మత్తు పదార్థాలకు అలవాటుపడిన వారిని ఆ వ్యసనం మానుకునేలా జిల్లా కేంద్రంలో డీ-అడిక్షన్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ మేరకు కలెక్టర్ తన ఛాంబర్లో డి.అడిక్షన్ సెంటర్ ఏర్పాటుపై సంబంధిత అధికారులతో పాటు, ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ విశాల్ తో ప్రత్యేకంగా చర్చించారు. ఈ కేంద్రం ఏర్పాటు దిశగా తక్షణమే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వి.సోమిరెడ్డి, నిజామాబాద్ ఏ.సీ.పీ రాజా వెంకట్ రెడ్డి, ఎక్సయిజ్ ఎన్ఫోర్స్ మెంట్ సహాయ సూపరింటెండెంట్ డీసీబీ.నాయక్, డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ, జిల్లా సంక్షేమ అధికారిణి రసూల్ బీ, పోలీస్, ఎక్సయిజ్, రవాణా, ఔషధ నియంత్రణ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

బ్యాంక్‌లో షార్ట్ సర్క్యూట్.. నిలిచిన సేవలు

- తప్పిన పెనుప్రమాదం



పూర్తిగా కాలిపోయిన విద్యుత్ వైర్‌లు

నవతెలంగాణ-మెండోరా

పోచంపాడ్ జాతీయ రహదారి పక్కనే ఉన్న ఎస్‌బీఐ భవనం విద్యుత్ మీటర్ ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి వైర్ లకు మంటలు అంటుకున్నాయి. అదే సమయంలో బ్యాంక్ స్వీపర్ బాయ్ బ్యాంకు వద్దకు రావడంతో మీటర్‌లో చెలరేగిన మంటలను చూసి బ్యాంక్ అధికారులకు , విద్యుత్ లైన్ మెన్ లకు సమాచారం ఇవ్వడంతో విద్యుత్ సిబ్బంది సహకారంతో విద్యుత్ సరఫరా నిలిపివేసి మంటలను ఆర్పివేశారు.

భవనం బయట మీటర్ లో మంటలు కావడంతో మంటలు లోపలి వరకు వెళ్ళకపోవడంతో భారీ అగ్నిప్రమాదం తప్పడంతో బ్యాంక్ అధికారులు ఊపిరి పిల్చుకున్నారు. అనంతరం విద్యుత్ అధికారులు వచ్చి దర్యాప్తు చేసి రిపోర్ట్ తీసుకున్నారు.

నిలిచిన తాత్కాలిక సేవలు

బ్యాంక్ భవనంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో బ్యాంక్ అధికారులు సోమవారం తాత్కాలికంగా బ్యాంక్ సేవలు నిలిపివేశారు.

రోజువెళ్లే మార్గమైనా డ్రైవింగ్‌లో అశ్రద్ధ తగదు

- జిల్లా రవాణా అధికారి కె. శ్రీనివాస్ రెడ్డి



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డిలోని విద్యాసంస్థల డ్రైవర్‌లు నిష్ణాతులు అని, వారి అనుభవాలు సమాజానికి ఉపయోగపడేలా రహదారి భద్రత ప్రచారకర్తలుగా వ్యవహారించాలని జిల్లా రవాణా అధికారి కె. శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ప్రతిరోజూ మనం వెళ్ళే మార్గమే కదా అని అశ్రద్ధ, అతినమ్మకంతో ఉదాసీనంగా వాహనాలు నడుపరాదని విద్య సంస్థల డ్రైవర్స్‌కి సూచనలు చేశారు. రహదారి భద్రత మాసోత్సవలలో భాగంగా ఎస్‌పిఆర్ స్కూల్ లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన మాట్లాడారు. ఈ అవగాహన కార్యక్రమంలో కళాబృందం ఆధ్వర్యంలో గీతలాపన, వీడియోలా ద్వారా ప్రమాదాలు జరగటానికి కారణలు వివరిస్తూ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్‌టిఏ మెంబెర్ అజాజ్‌ఖాన్, ఎస్. పి. ఆర్ స్కూల్ కరెస్పాండంట్ మారుతీ రావు, మోటార్ వెహికల్స్ ఇన్స్పెక్టర్ ఆర్. నాగలక్ష్మి , అత్యంత శ్రద్ధాసక్తులతో కార్యక్రమంలో పాల్గొన్న డ్రైవర్స్ కి, ఎస్. పి. ఆర్ స్కూల్ యాజమాన్యం కి ధన్యవాదములు తెలిపారు.

కంది పంట కొనుగోలుకు 8 కేంద్రాలు

- జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజర్ డి మహేష్ కుమార్

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లాలో కందులను కొనుగోలు చేయడానికి 8 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజర్ డి మహేష్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డి జిల్లాలో 56,189 ఎకరాలలో కంది పంట వేయడం జరిగిందనీ, దీనికి గాను ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మార్క్‌ఫెడ్ తరపున రైతులకు మద్దతు ధర క్వింటాల్ కు రూ. 7550, లభించడం కోసం (8) కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని జిల్లా స్థాయి కొనుగోలు కమిటీ నిర్ణయం తీసుకోనున్నట్టు ప్రకటనలో పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల వివరాలు మద్నూర్, జుక్కల్, పిట్లం, బిచ్కుంద, తాడ్వాయి, బోర్లామ్, గాంధారి, పద్మాజివాడీ తదితరచోట్ల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు. కావున రైతులు గమనించి తమ పంటను 12 శాతం తేమ ఉండేటట్లు ఎండబెట్టి కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వ మద్దతు ధర పొందగలరురాణి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్



నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగర పాలక సంస్థ ప్రత్యేక అధికారిగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పాలక వర్గం పదవీ కాలం పూర్తి కావడంతో కలెక్టర్ ను ప్రత్యేక అధికారిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు కలెక్టర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఇతర అధికారులు కలెక్టర్ కు పుష్ప గుచ్చాలు అందించి అభినందనలు తెలిపారు.

మొరం దందాపై షబ్బీర్‌అలీ ఆగ్రహం

- నవతెలంగాణలో వరుస కథనాలు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని జంగంపల్లి గ్రామ శివారులో ఉన్న సాయిబాబా ఆలయం వెనుక 'జోరుగా మొరం దందాలి', 'జోరుగా మొరం తవ్వకాలు' వరుస కథనాలకు స్పందించిన ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ సోమవారం తహసీల్దార్ శివప్రసాద్‌కు ఫోన్ చేసి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు మండల కాంగ్రెస్ నాయకులు తెలిపారు. గత కొంతకాలంగా ఇష్టానుసారంగా ప్రభుత్వ, ప్రైవేట్ భూమితో సంబంధాలు లేకుండా ఎక్కడబడితే అక్కడ చెరువులను తలపించేలా తవ్వకాలు చేపడుతున్న సదరు మొరం దందా నిర్వాహకుడు పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని హుకుం జారీ చేసినట్లు నాయకులు తెలిపారు. స్థానికులు సైతం సోమవారం తహసీల్దార్ శివప్రసాద్‌కు మొరం దందాపై సమాచారం ఇవ్వగా తవ్వకాలు చేపడుతున్న వద్దకు పోలీస్ శాఖను, రెవెన్యూ సిబ్బందిని పంపించి అక్రమ తవ్వకాలు చేపడుతున్న జెసిబి, టిప్పర్లను సీజ్ చేయాలని ఆదేశించినట్లు తహసీల్దార్ తెలిపారు. కానీ మొరందందా నిర్వాహకులను, టిప్పర్, జెసిబిలను పట్టుకొని సీజ్ చేశారా..? ముందుగానే నిర్వాహకులకు అక్కడినుండి వెళ్లిపోవాలని సమాచారం ఇచ్చారా అనే విషయం తెలియాల్సి ఉంది.

ప్రజావాణి పెండింగ్ ఆర్జీలను పరిష్కరించండి

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి

ప్రజావాణిలో వచ్చిన అర్జీలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పలు శాఖల్లో పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులపై సత్వర చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇప్పటి వరకు 19501 అర్జీలు రాగా, 18838 అర్జీలను పరిష్కరించారని, ఇంక 663 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. తాజాగా 71 అర్జీలు వచ్చినట్టు తెలిపారు.

అదేవిధంగా దినపత్రికల్లో వస్తున్న వ్యతిరేక వార్తలకు రిజాయిండర్స్ వెంటనే పంపించాలని తెలిపారు. కొత్తగా రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించాలని తెలి పారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు సంబంధించిన దరఖాస్తులను పరిశీలించాలని సూచించారు. జిల్లాలో ని అన్ని మండలాల, మున్సిపల్‌లోని ప్రజాపాలన కేంద్రాల్లో నాలుగు పథకాలకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించాలని తెలిపారు. ఒకే కుటుంబంలో రెండు, మూడు ఇండ్లు మంజూరు అయినట్టు పత్రికల్లో వచ్చిన వార్తల(ఇతర జిల్లాల్లో) ఆధారంగా పంచాయతీ కార్యదర్శులు మరొకసారి లబ్ధిదారుల ఇండ్లు పరిశీలించాలని తెలిపారు. ప్రజావాణిలో అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వి.విక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీఓ రంగనాథ్ రావు, జడ్పీ సీఈవో చందర్, పలు శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి



లబ్ధిదారులకు పథకాల పత్రాలు అందజేత

నవతెలంగాణ-ఎడపల్లి

గత పదేండ్లుగా మరుగున పడ్డ అభివృద్ధి పనులు.. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో సాధ్యమవుతున్నాయని బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని జైతాపూర్ గ్రామంలో పలు పథకాలకు ఎంపికైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాల పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత పాలకులు సొంత లాభాల కోసం పనిచేశారని, ప్రస్తుతం అభివృద్ధి పనులు చేసుకుంటూ ముందుకు సాగుదామన్నారు. సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకంగా ఉంటుందని ఇక్కడ అవినీతికి తావులేకుండా చూస్తామన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకున్నా.. అభివృద్ధి విషయంలో వెనుకడుగు వేసేదిలేదని తెలిపారు. సంస్థాగత ఎన్నికల్లో నీతి నిజాయితీగా ఉండేవారిని గెలిపించుకోవాల న్నారు. ఎన్నికైన ప్రజా ప్రతినిధులు అవినీతికి పాల్పడితే వారితో రాజీనామా చేయిస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ అనుబంధ సంస్థల సభ్యుడు గడుపు గంగాధర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, జెడ్పి మాజీ ఉపాధ్యక్షురాలు రజిత యాదవ్, మండలాధ్యక్షుడు పులి శ్రీనివాస్, నాయకులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొబ్బిలి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

7 కిలోల కణతి తొలగింపు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి (లింగంపేట్)



ఎల్లారెడ్డి మండల కేంద్రంలోని ఎల్లారెడ్డి సూపర్ స్పెషల్ ఆసుపత్రిలో సోమవారం కడుపులో ఏడు కిలోల కణతిని తొలగించినట్టు వైద్యాధికారి డాక్టర్ రవీంద్ర మోహన్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. మహమ్మద్ నగర్ మండలంలోని గుణుకుల్ గ్రామానికి చెందిన అబిదా బేగం కడుపునొప్పితో ఈనెల 25న ఎల్లారెడ్డి ఆసుపత్రికి వచ్చారు. వైద్యుల సలహా మేరకు సిటి స్కానింగ్ చేయించుకోవడంతో కడుపులో అండపాయ కణితిని వైద్యులు గుర్తించారు. ఆపరేషన్ చేసి 7 కిలోల కణతిని తొలగించనట్టు తెలిపారు. ప్రస్తుతం రోగి ఆరోగ్యంగా ఉందని డాక్టర్ రవీంద్ర మోహన్, డాక్టర్ సిద్ధిరాములు, డాక్టర్ మక్బుల్ తెలిపారు.

సామాజిక సేవకుడిని అభినందించిన మాజీ మంత్రి బోధన్ ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఆర్మూర్

జాతీయ స్థాయిలో భారత సేవ రత్న పురస్కారం అందుకున్న సామాజిక సేవకుడు తులసి పట్వారిని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అభినందించినట్టు ఆయన తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వారిని కలిసినట్టు తెలిపారు. ఇటువంటి సేవలు నేటి యువతరానికి స్ఫూర్తిదాయకమని చెప్పినట్టు తెలిపారు. పట్టణానికి చెందిన పలువురు నాయకులు తనను అభినందించినట్టు తెలిపారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని వినతి



నవతెలంగాణ-బోధన్

కేంద్ర ప్రభుత్వం కొత్త పింఛన్ విధానం రద్దుచేసి, పాత పించన్ విధానం పునరుద్ధరించాలని కోరుతూ సోమవారం పీఆర్టీయూ నాయకులు సబ్ కలెక్టర్ వికాస్ మహతోకు వినతిపత్రం అందించారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం సబ్ కలెక్టర్‌కు పిఆర్టియు డైరీని అందజేశారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియు బోధన్ డివిజన్ మాజీ ఇంచార్జ్ ఎంబెల్లి శంకర్, అర్బన్ అధ్యక్షులు థామస్, కైరాన్ సాహెబ్, ప్రధాన కార్యదర్శులు ధనరాజ్, పెంట గంగాధర్, నాయకులు కిషన్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విలేజ్ ఇన్నోవేషన్ అవార్డుకు ఎంపికైన విద్యార్థికి అభినందన



అవార్డును అందుకుంటున్న విద్యార్థి

నవతెలంగాణ-(వేల్పూర్)ఆర్మూర్

మండలంలోని అంక్సాపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థి శ్రీశాంత్ విలేజ్ ఇన్నోవేషన్ అవార్డు 2025కు ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆర్.మల్లేశ్వరి సోమవారం తెలిపారు. గైడ్ టీచర్ పసుపుల రఘునాథ్ సారథ్యంలో తయారు చేసిన ప్యాడి డ్రైవింగ్ మిషిన్‌కు గ్రామస్థాయిలో టీఎస్ఐసి ఆధ్వర్యంలో ఇంటింటా ఇన్నోవేటర్ అనే కార్యక్రమంలో భాగంగా ఈ సంవత్సరం గ్రామస్థాయి అవార్డు వచ్చినట్టు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి మాట్లాడుతూ.. తాను తయారుచేసిన పరికరం రైతులకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. దీని వల్ల వారి సమస్యలు ముఖ్యంగా నడుమునొప్పి, కాళ్ల నొప్పులు తగ్గుతాయని తెలిపారు. ఈ పరికరంతో ఎంత ధాన్యమైనా సులువుగా ఆరబెట్టవచ్చని చెప్పారు. ఇది కరెంటు లేకుండా పనిచేస్తుందని, గ్రామంలో గల అందరూ రైతులు దీన్ని ఉపయోగించాలని తెలిపారు. గ్రామంలోని పూర్వ విద్యార్థులు 2005-06 బ్యాచ్ విద్యార్థులు పాఠశాలకు నాలుగు ఫ్యాన్లు, వాటర్ ట్యాంకులను అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎంను అభినందించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి రవికుమార్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పిఆర్‌టియు ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న పిఆర్టియు నాయకులు

నవతెలంగాణ-బాల్కొండ

కేంద్ర ప్రభుత్వం సిపిఎస్‌కు బదులుగా ప్రవేశపెట్టిన యుపిఎస్‌ను వ్యతిరేకిస్తూ, తెలంగాణ ప్రభుత్వం యుపిఎస్‌లో చేర్చవద్దని, మేనిఫెస్టోలో పెట్టిన విధంగా వెంటనే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ పిఆర్టియు బాల్కొండ మండలాధ్యక్షులు వేల్పూర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం తహశీల్దార్ ఎ.శ్రీధర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పిఆర్‌టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జి.సురేష్‌కుమార్, ఎం.ప్రశాంత్ కుమార్, ఎ.రామ్‌కిషన్, బి.శంకర్, బి.రాములు, జె.సుందర్, వకీల్, ప్రాథమిక సభ్యులు పాల్గొన్నారు.

మండల సమైక్య ఆధ్వర్యంలో కమ్యూనిటీ కోఆర్డినేటర్‌కు ఘనంగా సన్మానం



కోఆర్డినేటర్‌ను సన్మానించిన పలువురు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల కేంద్రంలోని మండల సమైక్య కార్యాలయంలో కమ్యూనిటీ కోఆర్డినేటర్‌కు ఘనంగా సన్మానించారు. మండలంలోని ఐకెపి కార్యాలయంలో పనిచేస్తున్న కమ్యూనిటీ కోఆర్డినేటర్ రాములు మండలంలో జిల్లా స్థాయివరకు అన్ని టార్గెట్లను పూర్తిచేయడం, అన్ని పనులలో ముందంజలో ఉంచడంతో జిల్లా స్థాయి అధికారులు గుర్తించి గణతంత్ర దినోత్సవం వేడుకల్లో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మండల సమైక్యాలు ఉన్న సమైక్య సభ్యులు తోటి ఉద్యోగులందరూ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం రవీందర్‌రెడ్డి, మండల సమైక్య కార్యవర్గం కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, మండల సమైక్య సిబ్బంది, అన్ని గ్రామాల నుంచి వచ్చిన గ్రామ సంఘం అధ్యక్షులు తదితరులున్నారు.

ఆలూర్ పాఠశాలకు క్రీడా సామగ్రి అందజేత



పాఠశాలకు క్రీడా సామగ్రి అందజేత

నవతెలంగాణ-ఆర్మూర్

జడ్పీహెచ్ఎస్ ఆలూర్ పాఠశాలకు కె.దిలీప్ అనే కబడ్డీ క్రీడాకారుడు దాదాపు రూ.12వేలు క్రీడా సామగ్రిని సోమవారం పాఠశాలకు అందజేశారు. ఈ సామగ్రిలో భాగంగా (10 వాలీబాల్, 4 హ్యాండ్ బాల్స్, 1 బ్యాడ్మింటన్ నెట్ అదేవిధంగా ఒక క్రికెట్ నెట్) స్పాన్సర్ చేశారు. పాఠశాల అభివృద్ధిలో భాగంగా ఈ క్రీడ సామాగ్రి అందించినందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేందర్, స్థానిక పాఠశాల పిడి రాజేష్‌లు దిలీప్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల తరపున దిలీప్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. మీ సహాయ సహకారాలు పాఠశాలకు ఇలానే కొనసాగాలని భవిష్యత్తులో క్రీడల్లో కూడా ఆలూరు పాఠశాలను ముందుకు తీసుకెళ్తామని అన్నారు. కార్యక్రమంలో విడిసి చైర్మన్ బార్ల ముత్యం, మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి, ఉపసర్పంచ్ శ్రీనివాస్, మాజీ మాజీ ఎంపిటిసి మల్లేష్, పాఠశాల శ్రేయోభిలాషులు ముత్యం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే.. ప్రమాదాల కట్టడి

- ట్రాఫిక్ ఏసీపీ నారాయణ



మాట్లాడుతున్న ఏసీపీ నారాయణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ తగిన జాగ్రత్తలు వహిస్తేనే రోడ్డు ప్రమాదాలను పూర్తిగా అరికట్టవచ్చని నిజామాబాద్ ట్రాఫిక్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ నారాయణ తెలిపారు. సోమవారం మేరా యువ భారత్, నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో సంస్థ కార్యాలయంలో నిర్వహించిన రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు అన్నింటికీ కారణం నిబంధనలు పాటించకపోవడం, తగిన జాగ్రత్తలు వహించకపోవటమేనని అన్నారు. ఇది కేవలం చిన్నపాటి నిర్లక్ష్యం వల్ల జరుగుతున్న ఇబ్బంది అని, వీటి నుంచి అధిగమించటం కోసం కొన్ని జాగ్రత్తలు పాటించడం అవసరమని సూచించారు. జాగ్రత్తలు పాటించడం వల్ల మన ప్రాణాలతో పాటు మన కుటుంబాలు కూడా కాపాడబడతాయని ఆయన తెలిపారు. డ్రైవింగ్ లైసెన్సును కలిగి ఉండటం అంటే వాహనాన్ని పూర్తిగా నియంత్రణలో నడపటం అనే విషయాన్ని అర్థం చేసుకోవాలని ప్రతిసారి నిబంధనలను పాటించకుండా దొడ్డిదారిలో తప్పించుకునే ప్రయత్నం చేయటం వల్ల ఏదో ఒక రోజు ప్రమాదం జరిగి మనమే ఇబ్బంది పడతామని అందువల్ల తగిన జాగ్రత్తలు, నియమాలు పాటించడం అలవాటు చేసుకోవాలని సూచించారు. రోడ్డు భద్రత ప్రమాదాల నివారణ విషయంలో నెహ్రూ యువ కేంద్రం ఈ మూడు రోజుల కార్యశాల నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమం నిర్వాహకురాలు జిల్లా యువజన అధికారిని శైలి బెల్లాల్ మాట్లాడుతూ.. యువతకు హక్కులతో పాటు బాధ్యతలు కూడా తెలియాల్సిన అవసరం ఉందని రోడ్డు ప్రమాదంలో ఎక్కువగా మృతి చెందుతున్నది యువకులేనని అందువల్లే ప్రత్యేకంగా యువతకు ఈ అవగాహన కల్పించాలని ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు ఆమె తెలిపారు. శిక్షణలో భాగంగా ట్రాఫిక్ నియమాల పట్ల అవగాహన, ట్రాఫిక్ పోలీసుల విధుదల ప్రత్యక్ష పర్యవేక్షణపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఆమె పేర్కొన్నారు. శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న వాలంటీర్లకు టీషర్టులు, టోపీ ప్రశంసాపత్రాలను, మేరా యువభారత్ అందించే డైరీ, పెన్నును ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన యువకులు, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది, నెహ్రూ యువ కేంద్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే అక్రమాస్తులపై

ఎన్నికల కమిషన్‌కు తప్పుడు పత్రాలు అందజేత

- ఎన్నికల కమిషన్ విచారణ చేపట్టాలి
- కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు ఆదే ప్రవీణ్



మాట్లాడుతున్న కాంగ్రెస్ సీనియర్ నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

మాజీ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా ఎన్నికల సమయంలో తనకు ఉన్న ఆస్తులను తప్పుల తడకగా ఎన్నికల కమిషన్‌కు అందజేశారని, ఈ విషయంలో ఎన్నికల కమిషన్ (సంఘం) విచారణ చేపట్టాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆదె ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ స్వరాష్ట్రం సాధించుకున్న నాటి నుంచి తెలంగాణలో భూముల విలువలు లక్షల్లో పెరిగాయని పదేపదే చెప్పినప్పటికీ అదే పార్టీకి చెందిన నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే గణేష్ గుప్త మాత్రం తాను కొన్న భూమి 2019లో మాక్లూర్ మండల కేంద్రంలో, సర్వే నంబర్ 995/ఇ నందు 20 గుంటల భూమి 75 వెయిల 3 వందలకు కొనుగోలు చేసినట్లు ఎన్నికల కమిషన్‌కు నివేదిక సమర్పించాడని, తిరిగి అదే ఆస్తి 2023లో 25 లక్షలుగా చూపించారని, అదేవిధంగా 2021లో మాక్లూర్ మండల కేంద్రంలో సర్వే నంబర్‌లో 1068/అ, 1068, 1058/అ 2లో మొత్తం 9 ఎకరాలు కేవలం 4లక్షల 3 వెయిల, 598లకు కొనుగోలు చేసినట్లు చూపించాడని, మళ్ళీ 2023లో అదే భూమి 1 కోటి 23 లక్షల ధర అని చూపించారని దీనిని బట్టి అర్బన్ ఎమ్మెల్యే ఎంత దోచుకున్నారో అర్థమవుతుందని ఆరోపించారు. మాజీ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా తన అఫిడవిట్‌లో తప్పుడు సమాచారాన్ని ఇచ్చి ఎన్నికల కమీషన్‌ను, సంబంధిత శాఖ అధికారులను మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఎన్నికల కమిషన్ తప్పుడు సమాచారాన్ని ఇచ్చి ఎన్నికల కమిషన్ మోసం చేశారని చట్టరీత్యా ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఈర్ల శేఖర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జాతర బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలి

- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి ఆహ్వానం
- జాతర బ్రహ్మోత్సవాల గోడప్రతులు ఆవిష్కరణ



గోడప్రతులను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఎడపల్లి

ఫిబ్రవరి 5 నుంచి ప్రారంభమయ్యే శ్రీలక్ష్మీ నరసింహ స్వామి జాతర బ్రహ్మోత్సవాల కార్యక్రమాలో తప్పకుండా పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరుతూ ఎడపల్లి మండలం జానకంపేట శివారులో గల శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ, దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, జానకంపేట గ్రామ పెద్దలు సోమవారం బోధన్ నియోజకవర్గ శాసనసభ్యులు పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డిని తన నివాసంలో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం బోధన్ నియోజకవర్గ శాసనసభ్యులు సుదర్శన్ రెడ్డి చేతుల మీదుగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి జాతర బ్రహ్మోత్సవాల గోడ ప్రతులను ఆవిష్కరించారు. ప్రతి సంవత్సరం నిర్వహించే శ్రీలక్ష్మీనరసింహస్వామి జాతర బ్రహ్మోత్సవాల కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు అధికారులు ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈసారి జరిగే జాతర మహోత్సవాలను ఘనంగా జరుపనున్నట్లు ఆయన దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యే పి సుదర్శన్‌రెడ్డి సానుకూలంగా స్పందించి జాతర బ్రహ్మోత్సవాలకు తప్పకుండా హాజరవుతానని అధికారులకు, నాయకులకు హామీనిచ్చారు. కార్యక్రమంలో దేవదాయ ధర్మదాయశాఖ సహాయ కమిషనర్ శ్రీరామ్ రవీందర్, ఆలయ ఈవో గింజుపల్లి వేణు, ఎడపల్లి కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు పులి శ్రీనివాస్‌రావు, స్థానిక జానకంపేట్ నాయకులు సుంచన కోట రాధా కిషన్‌గౌడ్, ఉడుత గంగాధర్, రాజాచారి, గోల్ హనుమాన్ దేవాలయ పంతులు ప్రశాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన

రాష్ట్ర సోషల్ ఆడిట్ కమిటీ బృందం



రికార్డులను పరిశీలిస్తున్న రాష్ట్ర సోషల్ ఆడిట్ కమిటీ బృందం

నవతెలంగాణ-బాల్కొండ

ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా మధ్యాహ్న భోజన పథకం పారదర్శకంగా జరిగేలా సామాజిక తనిఖీ సోషల్ ఆడిట్ నిర్వహించాలని ప్రభుత్వ ఆదేశించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు సెంటర్ ఫర్ ఎకనామిక్ సోషల్ స్టడీస్ సంస్థ రాష్ట్ర పరిశీలకులు సోమవారం మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాల, బోదేపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రతిరోజు నెలవారి భోజనం చేసిన విద్యార్థుల సంఖ్య, విద్యార్థుల హాజరు, అందుకు వినియోగించిన బియ్యం, మధ్యాహ్న భోజనం మెనూ, పాఠశాలల శానిటేషన్‌లకు సంబంధించిన వివరాలను మండల విద్యాశాఖ అధికారి బట్టు రాజేశ్వర్‌ను అడిగి తెలుసుకున్నారు. మండల విద్యాశాఖ అధికారి స్పందిస్తూ ఈ మధ్యన భోజన విషయంలో అన్ని పాఠశాలల్లో మహిళా సమాఖ్య గ్రూపుల ద్వారా చాలా మంచిగా వంటకాలు చేస్తున్నట్టు తెలిపారు. మహిళలే ఏజెన్సీలు నిర్వహిస్తున్నారని, ఏజెన్సీలు చాలీచాలని వేతనాలు ఇస్తున్నారని, కానీ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వారి కుకింగ్ కాస్టుకు సరిపోవడం లేదని, వారి కుకింగ్ కాస్టు పెంచడం పెంచవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆయన రాతపూర్వకంగా రాష్ట్ర కమిటీకి తెలిపారు. అంతేకాకుండా గురుకులాలలో అమలవుతున్న కామన్ మెనూ పద్ధతిని మధ్యాహ్న భోజనం అమలవుతున్న పాఠశాలల్లో కూడా ప్రవేశపెట్టాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన సోషల్ ఆడిట్ రాష్ట్ర కమిటీ సభ్యులు మోహన్ రావు, నాగేష్, సుమలత, బోదేపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రతాపరెడ్డి, ప్రాథమిక పాఠశాల ఉర్దూ మీడియం న్యూ ప్రధానోపాధ్యాయులు సఫిక్ ఉన్నిసా, మధ్యాహ్న భోజన ఏజెన్సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కుట్టు మిషన్, జ్యూట్ బ్యాగ్ శిక్షణ

- ఎంపిక చేసిన 30 మందికి శిక్షణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని మాధవ స్మారక సేవా సమితి అధ్యక్షులు మర్రి క్రిష్టారెడ్డి అధ్యక్షతన, మెంబుర్స్ సోమవారం ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్ అండ్ జ్యూట్ బ్యాగ్ శిక్షణకు న్యాయసేవాధికార సంస్థ ఎంపిక చేసిన 30 మంది సెక్స్‌వర్కర్లకు స్నేహ సొసైటీ వారి సహకారంతో ఈ సంస్థ యందు 3 నెలలు శిక్షణ ఇప్పించినట్టు తెలిపారు. తద్వార వారిలో మార్పు కలుగుతుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల అన్నారు. ఈ శిక్షణ అనంతరం వారికి ఉచిత కుట్టు మిషన్లను ఇప్పించే ప్రయత్నం చేస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రెటరీ సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి, రామకృష్ణ సేవా సమితి ప్రెసిడెంట్, సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలి : మేడపాటి ప్రకాశ్‌రెడ్డి



నియమకపత్రాన్ని అందజేస్తున్న బీజేపీ నాయకులు

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని మంగళ్‌పహాడ్ గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు బండ అభిలాష్, పుట్టి సంతోష్‌ను బూత్ అధ్యక్షులుగా నియమించారు. బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకులు మేడపాటి ప్రకాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో నియామకపత్రాలను అందజేశారు. సోమవారం బోధన్ పట్టణంలోని మేడపాటి ప్రకాష్‌రెడ్డి నివాస ఆవరణలో బోధన్ డివిజన్ స్థాయి బీజేపీ పదాదికారుల, నాయకుల కార్యకర్తల విస్తృత సమావేశాన్ని ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బీజేపీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేస్తూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు తెలియపరచాల్సిన అవసరం ఉందన్నారు. ఎడపల్లి మండలంలోని ఆయా గ్రామాలలో గల బూత్ అధ్యక్షులుగా యువకులను నియమించారు. మంగళ్‌పాడ్ గ్రామంలోని 230 బూత్ అధ్యక్షులుగా బండ అభిలాష్, 231 బూత్ అధ్యక్షులుగా పుట్టి సంతోష్‌ను నియమిస్తూ నియామకపత్రాన్ని మేడపాటి ప్రకాశ్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఎడపల్లి బీజేపీ మండల ఉపాధ్యక్షులు కోల ఇంద్రకరణ్, జిల్లా నాయకులు కందగట్ల రామచందర్, మంగళ్‌పహాడ్ బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి పెద్ద పద్మశాలి సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

- బిజెపి మండలాధ్యక్షుడికి ఘనంగా సన్మానం



సన్మానించిన పలువురు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

జక్రాన్‌పల్లి పద్మశాలి పెద్ద సంఘంలో నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. నూతన అధ్యక్షునిగా బొద్దుల చక్రపాణి, ప్రధాన కార్యదర్శిగా బొద్దుల చందు, కోశాధికారిగా గుడ్ల వేణు, సభ్యులుగా జుంజునూరి రాము, పవన్ ఎన్నికయ్యారు. అలాగే నూతనంగా బిజెపి జక్రాన్‌పల్లి మండల అధ్యక్షునిగా ఎన్నికైన కన్నెపల్లి ప్రసాద్‌ను పద్మశాలి సంఘ సభ్యులు ఘనంగా సన్మానించారు. తమ పద్మశాలి సంఘంలోని సభ్యునికి బిజెపి మండల అధ్యక్ష పదవిలో నియమించినందుకు ఎంపీ ధర్మపురి అరవింద్‌కు, బిజెపి జిల్లా అధ్యక్షులు దినేష్ కులచారికి పద్మశాలి పెద్ద సంఘం అధ్యక్ష కార్యదర్శులు, సంఘం సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం సభ్యులందరూ పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు చేసుకోవాలని ఆదర్శ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పడిగెల దశరథ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్ష కోసం ఆన్లైన్‌లో దరఖాస్తులను జనవరి 06 నుంచి ప్రారంభమైందని, ఈ నెల 28 వరకు ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించారు. 7, 8, 9, 10వ తరగతులకు మిగిలి ఉన్న సీట్లకు కూడా దరఖాస్తులు చేసుకోవాలని, అన్ని తరగతులకు సంబంధించిన పరీక్ష 13 ఏప్రిల్ 2025న ఉంటుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ దశరథ్ కోరారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండలంలోని నాగ్లూర్ గ్రామ పంచాయతీ పరిధిలోనీ కాటేవాడి తండాలో రూ.5 లక్షల నిధులతో సిసి రోడ్డు పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బండారి పరమేష్, గాంధారి సొసైటీ చైర్మన్ సాయికుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల లక్ష్మణ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మోహన్ నాయక్, గాంధారి మాజీ సర్పంచ్ మమ్మాయి సంజీవ్ యాదవ్, మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు తూర్పు రాజులు, నియోజవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సర్దార్ నాయక్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సంఘని బాబా, బొమ్మని బాలయ్య, నాయకులు నాగులూర్ రవి, సంతోష్ నాయక్, గడ శంకర్, భాగ్య నాయక్, బల్వంత్ రావు,రవి నాయక్, గణపతి, శేఖర్ తండా ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-దోమకొండ

మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్యా లయం వద్ద పంచాయతీ కార్యదర్శి యాదగిరి, పోలీస్ స్టేషన్, కార్యాలయంలో యేసయ్య సుబ్రహ్మణ్య చారి, తహసీల్దార్ కార్యాలయం వద్ద సంజయ్ రావు, మండల పరిషత్ కార్యాల యంలో ఎంపీడీవో ప్రవీణ్ కుమారు, జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సాంబశివ రాములు, మండల అధ్యక్షుడు అబ్రబోయిన రాజేందర్ , సభ్యుల ఆధ్వర్యంలో బిసి సంక్షేమ సంఘం క్యాలెండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం విద్యార్థి సంఘ అధ్యక్షులు నీల నాగరాజు ,జిల్లా గౌరవ అధ్యక్షులు అబ్రబోయిన స్వామి ,ఉపాధ్యక్షుడు మోహన చారి ,మాజీ జెడ్పిటిసి సభ్యులు తిరుమల గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి ,కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సీతారాం మదు నాయకులు నల్లపు శ్రీనివాస్ ,పున్న లక్ష్మణ్ , తదితరులు పాల్గొన్నారు.

పదోతరగతి టాపర్‌కు నగదు బహుమతి

నవతెలంగాణ-లింగంపేట్

పదో తరగతిలో అత్యధిక ప్రతిభ కనబరిచిన విద్యార్థినికి సోమవారం నగదు బహుమతిని అందజేశారు. లింగంపేట్ మండలంలోని నల్లమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2023-2024 సంవత్సరంలో పదవ తరగతిలో అత్యధిక ప్రతిభ కనబరిచిన ఆదిబాకు వెయ్యి రూపాయల నగదుతో పాటు గోల్డ్ మెడల్, శాలువాతో సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థిని ఆదర్శంగా తీసుకోవాలని పదో తరగతి పరీక్షల పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

భగవద్గీత పుస్తకాలు పంపిణీ

నవతెలంగాణ-తాడ్వాయి

మండల కేంద్రానికి చెంది రామోజీ సిద్ధిరాములు సోమవారం భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేశారు. గీత పఠనంతో మానవ సంబంధాలకున్న విలువలు తెలుస్తాయని దీనితో మనశ్శాంతి కలుగుతుందని తెలిపారు. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలకు చెందిన పలువురికి పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. గీతా పఠనంపై ఆసక్తి ఉన్నవారు తనను సంప్రదిస్తే మరిన్ని గీతా పుస్తకాలు అందజేయున్నట్లు తెలిపారు.

వేలాదిగా తరలిరావాలి

నవతెలంగాణ-కామారెడ్డి

ఫిబ్రవరి 7న మందకృష్ణ మాదిగ తలపెట్టిన లక్ష డప్పులు వెయ్యి గొంతుల మహాసభలకు వేలాదిగా వికలాంగులు తరలివచ్చి విజయవంతం చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మార్పీఎస్‌కు వికలాంగుల హక్కుల పోరాట కమిటీ మద్దతు ఇస్తున్నట్టు తెలిపారు.

పూర్వీకుల భూమి కబ్జా చేసి బెదిరిస్తున్నారు



నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా గాంధారి మండల కేంద్రానికి చెందిన బంజ నాగయ్య వారసులైన బంజ శంకర్ అప్ప, బంజ సంగప్ప, బంజరాజప్ప లు తమ తాతల నాటి భూమి సర్వే నెంబర్ 3లో ఉన్న స్థలాన్ని మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి ఇతరులతో కలిసి తమను బెదిరిస్తూ కబ్జా చేసుకుని వాటిని ప్లాట్లుగా చేసి విక్రయిస్తున్నారని వాపోయారు. సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. కబ్జా దారులకు అధికారులు సహకరిస్తున్నారని, ఆ భూమిపై ఎలాంటి రిజిస్ట్రేషన్లు చేయకుండా నిలిపివేయాలని కోరుతూ ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. సర్వే నెంబర్ వేయకుండా అసెస్‌మెంట్ నెంబర్‌లో రిజిస్ట్రేషన్ చేస్తున్నారని, సదరు వ్యక్తి తమ భూమిని కబ్జా చేసి తప్పుడు పత్రాలు సృష్టించుకుని వారసత్వ భూమిగా చెప్తూ తప్పుడు రిజిస్ట్రేషన్లకు పాల్పడుతున్నాడని వాపోయారు. దీనిపై అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేసి తమకు న్యాయం చేయాలని కలెక్టర్ ను కోరామన్నారు.

'గ్రామాలను అభివృద్ధి చేస్తాం'

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండలంలోని పోచారం గ్రామంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా సిసి రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాలను అభివృద్ధి చేయడమే తన లక్ష్యంగా భావించి తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత పది సంవత్సరాలు పాలించిన గత పాలకులు గ్రామాలను అభివృద్ధి చేయలేకపోయారని అభివృద్ధి చేయకపోవడంతో ప్రజలు విసిగిపోయి ప్రజలకు మేలు చేసే ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ అని గ్రహించి కాంగ్రెస్ పార్టీని రాష్ట్రంలోకి అధికారంలోకి తెచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో శామప్ప పటేల్, చిప్ప మోహన్, అశోక్, బాలాజీ పటేల్, మారుతి, ముస్సాజీ,బసవరాజ్ దేశాయ్,నాగరాజు, పోచారం గ్రామం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు, తల్లిదండ్రులకు ప్రేరణ

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండల కేంద్రంలోని శ్రీ వాసవి హైస్కూల్ ఆధ్వర్యంలో గురు ఫంక్షన్ హాల్ లో సోమవారం నాడు మోటివేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల విద్యార్థిని విద్యార్థులు వారి తల్లిదండ్రులు హాజరయ్యారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు మోటివేషన్ స్పీకర్ శ్రీనివాస్ సందేశాన్ని ఇచ్చారు. ప్రముఖ కళాశాలలో సంస్థల్లో తమ స్ఫూర్తిదాయక ఉపన్యాసాలు అందించే శ్రీనివాస్ పాఠశాల పిల్లల చదువుల గురించి మార్కుల గురించి టైం టేబుల్ గురించి ఆసక్తి దాయకంగా వివరించారు. శ్రీ వాసవి స్కూల్ యజమాన్య కరస్పాండెంట్ ఉమాకాంత్ మాట్లాడుతూ ఈ ప్రాంతం మద్నూర్‌లో విద్యారంగం వికసించాలన్న తపనే మాకు ప్రేరణ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఉమాకాంత్ డైరెక్టర్ శశికాంత్ పాఠశాల ప్రిన్సిపాల్ వినోద్ విద్యార్థిని విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ

నవతెలంగాణ-రాజంపేట్ (భిక్కనూర్)

రాజంపేట్ మండలంలోని ఆర్గొండ గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు గ్రామానికి చెందిన పల్లె దవాఖాన వైద్యులు రాజశేఖర్ స్నాక్స్ పంపిణీ చేశారు. అలాగే గ్రామానికి చెందిన నారాయణ, బాల్ లింగం 10 బెంచీలను పాఠశాలకు అందజేశారు. విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పూర్ణచందర్, ఏ ఏపీసి అధ్యక్షురాలు పుష్పలత, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

నవతెలంగాణ-విలేకరుల బృందం

నవీపేట్ : ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ పిఆర్‌టియు ఆధ్వర్యంలో తహసీల్దార్ వెంకటరమణకు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పిఆర్టియు జిల్లా అధ్యక్షులు మోహన్‌రెడ్డి, మండలాధ్యక్షులు భూమయ్య మాట్లాడు తూ.. కేంద్ర ప్రభుత్వం సిపిఎస్ స్థానంలో ఏకీకృత పెన్షన్ స్కీమ్ (యుపిఎస్)ను ప్రవేశపెట్టిందని, కానీ గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని పున రుద్ధరిస్తామని మేనిఫెస్టోలో ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశా రు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించే తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షులు గోపిడి రవీందర్, మేక సుధాకర్‌రెడ్డి, గంగోని శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎడపల్లి : సిపిఎస్ స్థానంలో ఓపిఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని పిఆర్‌టియు శాఖ డిమాండ్ చేసింది. సోమవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో పిఆర్టియు టిఎస్ శాఖ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ అనూషకు వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు మోహన్‌రెడ్డి, పిఆర్‌టియు మండల అధ్యక్షులు సిహెచ్.సాయిరెడ్డి, ప్రధాన కార్యదర్శి గోవర్ధన్, అసోసియేట్ మండలాధ్యక్షులు శ్రీనివాసరావు, కార్యదర్శి బాలేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రామారావు, సీనియర్ ఉపాధ్యాయులు దత్తాద్రి, ఎంఐఎస్ కోఆర్డినేటర్ రవికుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం యుపిఎస్‌లో చేరొద్దని ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన విధంగా ఓల్డ్ పెన్షన్ స్కీమ్ ఇవ్వాలని కోరుతూ తహసీల్దార్ ఆంజనేయులుకు పిఆర్టియు కమ్మర్‌పల్లి మండల శాఖ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. కేంద్ర ప్రభుత్వం సిపిఎస్‌కు బదులుగా ప్రవేశపెట్టిన యునైటెడ్ పెన్షన్ స్కీమ్ (యుపిఎస్)ను వ్యతిరేకిస్తూ యుపిఎస్‌లో చేరొద్దని విన్నవించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఓల్డ్ పెన్షన్ స్కీమ్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పిఆర్టీయూ మండల అధ్యక్షులు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి ఆంజాద్ సుల్తాన్, రాజేశ్వర్‌గౌడ్, నాగభూషణం, రోహిత్, నరేష్, సున్నం శ్రీనివాస్, కోల రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్ : కేంద్ర ప్రభుత్వం రానున్న ఏప్రిల్ 1నుంచి యూపీఎస్ (ఏకీకృత పెన్షన్ స్కీమ్)ను అమలు చేయనున్న సందర్భంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని సీపీఎస్ నుంచి యూపీఎస్‌కి కాకుండా సీపీఎస్‌ను రద్దు చేసి నేరుగా పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరుతూ మధ్యాహ్నం భోజనం సమయంలో పీఆర్టీయూ టీఎస్ నాయకులు ముప్కాల్ డిప్యూటీ తహసీల్దార్ పి.శ్రీకాంత్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ టీఎస్ మండలాధ్యక్షులు కొత్తపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొండ్రు నవీన్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గుండోజీ నరేందర్, సామ ప్రసాద్, తాడూరి లక్ష్మణ్, శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రామకృష్ణ, మండల అసోసియేట్ అధ్యక్షులు గండికోట రవి, మండల కార్యదర్శి గంగారాజుల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్ : పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలంటూ పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో పలువురు ఉపా ధ్యాయులు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అం దజేశారు. ఈసందర్భంగా పిఆర్టియు మండల అధ్యక్షులు జగదీష్ మాట్లాడుతూ.. పెన్షన్ పొందడం ప్రభుత్వ ఉద్యో గులకు రాజ్యాంగం కల్పించిన హక్కు అన్నారు. 30 సంవ త్సరాల పాటు ప్రభుత్వ కార్యక్రమాల అమలులో కీలక పాత్ర పోషించి ఉద్యోగ రీత్యా కుటుంబాలకు దూరమై పగలనక రాత్రనక పనిచేస్తున్న ఉద్యోగులకు పెన్షన్ రద్దు చేయడం హేయమైన చర్య అన్నారు. అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్లకు జూనియర్ లెక్చరర్లుగా పదోన్నతి కల్పించేందుకు జీవో 302ను పునరుద్ధరించాలని, జీవో 317 బాధితుల అన్ని రకాల అప్పీళ్లను పరిష్కరించాలని తహసీల్దార్ దశరథ్ ద్వారా ప్రభుత్వానికి విన్నవించుకుం టున్నామని తెలిపారు. కార్యక్రమంలో పిఆర్టియు మండల ప్రధాన కార్యదర్శి కిషోర్, ఉపాధ్యాయులు సుదర్శన్ రెడ్డి, కాశీనాథ్,రాజు,క్రాంతి,రమేష్, ధర్మేందర్, ఆయా పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పెద్దకొడప్‌గల్ : తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

క్రీడలలో గెలుపోటములు సహజమే

- విజేతలకు నగదు పురస్కారం, మెమెంటో అందజేసిన ఎంపీ సురేశ్‌షెట్కార్

నవతెలంగాణ-పిట్లం

క్రీడలలో గెలుపు ఓటములు సహజమేనని జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కార్ అన్నారు. స్వతంత్ర సమరయోధులు , దివంగత మాజీ ఎమ్మెల్యే శివ రావు షెట్కార్ స్మారక క్రికెట్ టోర్నమెంట్ రన్నర్ , విన్నర్‌లకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి అయిన దివంగత స్వతంత్ర సమరయోధులు , మాజీ ఎమ్మెల్యే శివరావు షెట్కార్ వర్ధంతి సందర్భంగా ఈనెల 14 న మండల కేంద్రంలోని బ్రహ్మంగారి గుడి ఆవరణలో మండల కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షులు , వివేకానంద పాఠశాల కరస్పాండెంట్ ఏనుగండ్ల శ్రీనివాస్ రెడ్డి క్రికెట్ స్మారక పోటీలు నిర్వహించడం చాలా అభినందనీయమన్నారు. క్రికెట్ టోర్నమెంట్ లో ఓడినవారు కృంగిపోకుండా మళ్లీ ప్రయత్నాలు చేసి మొదటి మెట్టును చేరుకోవాలని ఆకాంక్షించారు. ఫైనల్ పోటీలకు చేరుకున్న పిట్లం , బిచ్కుంద జట్లు తలపడగా పిట్లం జట్టు విజేతగా నిలిచి విన్నర్ ప్రైజుకుగాను 51 వేల రూపాయలు , మేమెంటో కైవసం చేసుకోగా బిచ్కుంద అద్నాన్ జట్టు రన్నర్‌గా నిలిచి 25 వేల రూపాయలు మేమెంటో ఎంపీ తన చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జాంబిగే హన్మాండ్లు, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు కృష్ణారెడ్డి, నల్ల వాగు మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ గుండు నరేందర్ , మండల సింగిల్ విండో వైస్ చైర్మన్ డాకూరి వెంకట్ రెడ్డి, మోహిన్, నీళ్లబోయిన ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



పర్మళ్లలో తాగునీటి కటకట



ట్యాంకర్ నీటిని పట్టుకుంటున్న గ్రామస్తులు

నవతెలంగాణ-లింగంపేట్

వేసవి రాకముందే గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్ర రూపం దాల్చుతుంది. తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చివరికి గ్రామపంచాయతీ కేటాయించిన వాటర్ ట్యాంకర్ ప్రజలకు దిక్కయింది. పరమల గ్రామపంచాయతీ కి తాగునీటి సరఫరా కోసం మూడు బోర్లు ఉన్నాయి. బోర్ల ద్వారా తాగునీటిని ట్యాంకర్ లోకి నింపి ప్రజలకు నీరు సరఫరా చేస్తుండేవారు. ప్రస్తుతం వేసవికాలం రాకముందే వారం రోజుల నుండి మూడు గ్రామ పంచాయతీకి సంబంధించిన బోర్లు సక్రమంగా నీళ్ల ట్యాంకర్లకు సరఫరా చేయకపోవడంతో ప్రజలు తాగునీటి కోసం తంటాలు పడుతున్నారు.

తాగునీటి సమస్య గురించి ప్రజలు సంబంధిత గ్రామపంచాయతీ కార్యదర్శి గ్రామ పంచా యతీ అధికారి దృష్టికి తీసుకొచ్చిన ఫలితం లేకుండా పోయింది. ప్రత్యమ్నంగా బోరు మోటర్ లో నీళ్లు తగ్గడంతో మరో రెండు పైపులు బోరు మోటర్లకు దించి సరఫరా చేయాల్సి ఉంది అదనంగా పైపులు బోరు మోటర్ లోకి దింపితే నీటి సమస్య పరిష్కారమయ్యే అవకాశాలు ఉన్నాయి.

వేయి గొంతులు లక్ష డప్పులు విజయవంతం చేయండి

నవతెలంగాణ-మద్నూర్

ఫిబ్రవరి 7న చలో హైదరాబాద్‌లో భాగంగా వేయి గొంతులు లక్ష డబ్బులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో విజయ్ అధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిం చారు. ప్రతి గ్రామం నుంచి భారీ సంఖ్యలో తరలి వెళ్లి విజయవంతం చేయాలని రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విజయ్, మండల అధ్యక్షుడు మారుతి, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు తుకారం,భుజం సార్, దశరథ్, పాల్గొన్నారు.

యూత్ ఫర్ యూనిటీ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని బస్వాపూర్ గ్రామంలో ఇటీవల కాలంలో మరణించిన దశరథ్ కుటుంబాన్ని పరామర్శించి యూత్ ఫర్ యూనిటీ ఆధ్వర్యంలో 15,200 రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు మాట్లాడుతూ గ్రామస్తులు, యూత్ సభ్యుల నుండి సేకరించిన విరాళాన్ని కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ ఫర్ యూనిటీ సభ్యులు, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

బోర్ తవ్వకం ప్రారంభం

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలం పెద్ద నల్లమడుగు తండాలో బోరు తవ్వకాన్ని ప్రారంభించినట్టు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బుర్ర నారా గౌడ్ తెలిపారు. తాగునీటి ఎద్దడి ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ఆదేశానుసారం పనులు ప్రారంభించినట్టు తెలిపారు. కార్యక్రమంలో లింగంపేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుర్ర నారా గౌడ్. మండల వర్కింగ్ ప్రెసిడెంట్ దశరథ్ నాయక్ మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ నగేష్. మండల యూత్ అధ్యక్షులు రాజు ఎల్లారెడ్డి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ కార్యదర్శి రాజేశ్వర్ గౌడ్. మార్కెట్ కమిటీ డైరెక్టర్ పూల్ సింగ్ మండల నాయకులు శ్రీనివాస్. శివలాల్. తదితరులున్నారు.

విద్యార్థులకు బహుమతులు వితరణ

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని ఉప్పల్వాయి ఆవాస ప్రాంత పాఠశాల విద్యార్థులకు కామారెడ్డి పట్టణానికి చెందిన మీనాక్షి బహుమతుల దుకాణ యజమాని వెంకటేశం బహుమతులను సోమవారం అందజేశారు. మండల విద్యాశాఖ అధికారి వెంకటేశంను అభినందించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఆనంద్ రావు, సిఆర్పి మహమ్మద్ తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థికి సన్మానం

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని సజ్జనపల్లి గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి ప్రశాంత్‌ను సోమవారం పాఠశాల ఉపాధ్యాయుల బృందం శాలువా కప్పి పూలదండ వేసి ఘనంగా సన్మానించారు. స్కూల్లో చదువుకొని ఆర్మీ విభాగంలో దేశానికి సేవ చేస్తున్న సందర్భాన్ని పురస్కరించుకొని గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయన్న. ఉపాధ్యాయులు పర్వయ్య ఉపాధ్యాయుల బృందం విద్యా కమిటీ సభ్యులు గ్రామస్తులు విద్యార్థులు ఉన్నారు.

మందు తాగొద్దు.. అంబులెన్స్ ఎక్కొద్దు

- ఎస్సై ఆంజనేయులు

నవతెలంగాణ-గాంధారి



మాట్లాడుతున్న ఎస్సై

మద్యం సేవించి వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాలకు గురై అంబులెన్స్‌లు ఎక్కే ప్రమా దాలు తెచ్చుకోవద్దని ఎస్ఐ ఆంజనేయులు సూచంచారు. మండల కేంద్రంలో పోలీస్ శాఖ, మోటార్ వెహికల్స్ శాఖ ఆధ్వర్యంలో మండల ప్రజలకు రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన నిర్వహించారు. గాంధారి ఎస్సై ఆంజనేయులు, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బిక్షపతి ఆధ్వర్యంలో రోడ్డు భద్రత మాస ఉత్సవ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనంపై వెళ్లేటప్పుడు హెల్మెట్ ధరించాలి, డ్రైవింగ్ చేసేటప్పుడు మొబైల్ ఫోన్ ఉపయోగించకూడదన్నారు. ఎవరికైనా ఆక్సిడెంట్ అయిన వెంటనే అక్కడ ఉన్న వారు గాయపడిన వారిని హాస్పిటల్‌కి పంపించి చికిత్స చేయించాలని తెలిపారు. లేదా పోలీసులకు, 108కు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వాహన చోదకులు, ఆటో డ్రైవర్లు, ట్రాక్టర్ డ్రైవర్లు, పోలీసులు, రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.


రైతు భరోసా దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని పోల్కంపేట్ గ్రామంలో సోమవారం రైతు భరోసా కోసం దరఖాస్తుల స్వీకరించినట్టు వ్యవసాయ విస్తీర్ణ అధికారి రాకేష్ తెలిపారు. పోల్కంపేట్ రైతు వేదిక లో రైతు భరోసా దరఖాస్తులను వ్యవసాయ విస్తరణ అధికారి రాకేష్ 41 దరఖాస్తులను తీసుకున్నట్టు తెలిపారు. కొత్తగా పట్టా పాస్ బుక్ వచ్చిన వారు రైతు భరోసా పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు

బడి బయట పిల్లలు బడిలోకి

నవతెలంగాణ-తాడ్వాయి



తాడ్వాయిలో...

బడి బయట పిల్లలను బడిలో చేర్పించినట్టు విద్యాశాఖ అధికారి రామస్వామి తెలిపారు. సోమవారం గ్రామంలో సర్వే చేపట్టగా గ్రామానికి చెందిన ఇద్దరు బడి బయట పిల్లలను గుర్తించి సమీపంలోని తిమ్మకపల్లి గ్రామ పాఠశాలలో చేర్పించినట్టు తెలిపారు. పిల్లల గుర్తింపు ఈనెల 31 వరకు చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో సిఆర్‌పిలు, నర్సింలు, రాజేందర్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్ : మండలంలోని నర్సింగ్ రావుపల్లి గ్రామంలో సోమవారం క్లస్టర్ రిసోర్స్ పర్సన్ శ్రీధర్ కుమార్ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయుడు దేవి సింగ్ సమక్షంలో బడి బయట పిల్లల సర్వే నిర్వహించారు. అందులో భాగంగా నర్సింగ్ రావుపల్లి హ్యాబిటేషన్‌లో ముగ్గురు బడీడు పిల్లలను గుర్తించారు. వారిని నర్సింగ్ రావుపల్లి పాఠశాలలో చేర్పించినట్టు తెలిపారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు వెళ్లేలా కౌన్సిలింగ్ ఇంచినట్టు పేర్కొన్నారు.

లింగంపేట్ : మండలంలోని రాంపల్లి కొన తండాలో సోమవారం నలుగురు బడి బయట పిల్లలను గుర్తించినట్టు మండల క్లస్టర్ రిసోర్స్ పర్సన్ సత్యనారాయణ తెలిపారు. విద్యార్థులకు బడి మానివేసేందుకు కారణాలు అడిగి తెలుసుకోగా తమ కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగా లేనందున మధ్యలో బడి మానివేసినట్లు విద్యార్థులు తెలిపారు. ఈ విద్యార్థులు 19 సంవత్సరాల వయస్సు కంటే తక్కువగా ఉండడం వలన ఓపెన్ స్కూల్‌లో పదవ తరగతిలో చేరాలని ప్రభుత్వమే ఆ ఖర్చును తిరిగి ఇస్తుందని విద్యార్థులకు, తల్లిదండ్రులకు తెలియజేయడంతో తిరిగి అకౌంట్లో జమ చేసిందని చెప్పడంతో ఓపెన్ స్కూల్ లో చేరడానికి విద్యార్థులు ఆసక్తిగా ఉన్నట్టు తెలిపారు. ఓపెన్ టెన్త్ మరియు ఓపెన్ ఇంటర్ చివరి తేదీ ఈనెల 29 కావున బడి మధ్యలో ఆపివేసిన విద్యార్థులు ఉపయోగించుకోవాలని అన్నారు.

అదృశ్యమైన వ్యక్తి శవమై తేలాడు

నవతెలంగాణ-నిజాంసాగర్

భార్యతో గొడవపడి భర్త అదృశ్యమైన ఘటన మండలంలోని వడ్డేపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకోగా అదృశ్యమైన వ్యక్తి సోమవారం శవమై కనిపించాడు. ఎస్ ఐ శివకుమార్ వివరాల ప్రకారం.. వడ్డేపల్లి గ్రామానికి చెందిన బిక్షపతి (37) శుక్రవారం సాయంత్రం ఆమె భార్యతో గొడవపడి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. తిరిగి రాకపోవడంతో శనివారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా అదృశ్యం కేసు పోలీసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా వడ్డేపల్లి గ్రామ శివారులో గల పాపాహరేశ్వర కుంట వద్ద సోమవారం శవం తేలడంతో వెళ్లి పరిశీలించగా బిక్షపతిగా పోలీసులు నిర్ధారణ చేశారు. వెంటనే స్థానికుల సాయంతో శవాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు.

బిజెపి నాయకుడి దారుణ హత్య

నవతెలంగాణ-భిక్కనూర్

సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలో భిక్కనూరు మండలం మల్లుపల్లి గ్రామానికి చెందిన నారాయణ(42) దారుణ హత్యకు గురయ్యాడు. వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణ గత మూడు సంవత్సరాలుగా హత్నూర మండలం లోని ఒక ప్రైవేట్ సీడ్ కంపెనీలో పనిచేస్తున్నాడు. గత 24 తారీఖున తన భర్త కనిపించడం లేదు అని అతని భార్య లక్ష్మి హత్నూర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసుల దర్యాప్తులో భాగంగా హత్నూర మండలంలోని దోర్పల్ల గ్రామ శివారులో సోమవారం తెల్లవారుజామున నారాయణ మృతదే హం లభించింది. ఈ విషయం తెలుసుకున్న మల్లుపల్లి గ్రామానికి చెందిన కుటుంబ సభ్యులు వెంటనే దోర్పల్లకు తరలి వెళ్లారు. ఈ కేసులో భాగంగా మృతుడి భార్య లక్ష్మి తో పాటుగా భిక్కనూరు మండలంలోని మరో నలుగురిని హత్నూర పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు కుటుంబ సభ్యులు గ్రామస్తులు పేర్కొన్నారు. మృతుడికి ఇద్దరూ పిల్లలు ఉన్నారు.

జువాలజీ అధ్యాపకురాలికి ప్రశంస

నవతెలంగాణ-సదాశివనగర్

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల కామారెడ్డి జువాలజీ అధ్యాకురాలు కారం వనజ బెస్ట్ ఎంప్లాయ్‌గా ఎంపికయ్యారు. 76 వ గణతంత్ర దినోత్సవం రోజున కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ గారి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి. శోభారాణి తెలిపారు. ప్రిన్సిపల్,వైస్ ప్రిన్సిపాల్స్ మీనా, శ్రావణి తో పాటు కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర బృందం వనజ ను అభినందించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన దశరథ్ ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న స్వామి వివేకానంద యూత్ బాధిత కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించి యూత్ ఆధ్వర్యంలో 5100 రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో దశరథ్ తోటి మిత్రులు, యూత్ సభ్యులు, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ భూమి మహారాష్ట్ర మహారాజుపేర పట్టా

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండల కేంద్రంలోని సర్వే నంబర్ 852 ప్రభుత్వ స్థలాన్ని మహారాష్ట్ర మహారాజు పేరున పట్టా చేసిన దానిపై సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కర్రే వార్ రాములు తహసీల్దార్ ఎండి ముజీబ్ కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ భూమి కబ్జా చేసి ప్రతి నెల లక్షల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రత్యేకంగా విచారణ చేపట్టి ప్రభుత్వ భూమిని వెంటనే స్వాధీనం చేసుకోవాలని కోరారు.

పిల్లల్లో పోషణలోపంపై గ్రామ సంఘం సభ్యులకు శిక్షణ

నవతెలంగాణ-రాజంపేట్(భిక్కనూర్)

పిల్లల్లో పోషణలోపం తగ్గించడం, నివారించడంపై వివో ఏ, గ్రామ సంఘం సభ్యులకు సోమవారం రాజంపేట్ మండలంలోని ఐకెపి కార్యాలయంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిపిఎం రమేష్ బాబు మాట్లాడుతూ ప్రతి గ్రామాలలో ఐదేళ్లలోపు చిన్నారులకు పోషణ లోపం పెరుగుతుందని దీనివల్ల వారి శరీరక పెరుగుదల మానసిక వికాసం బలహీనపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం సాయిలు, సీసీలు శ్రీనివాస్, రమేష్, భాగయ్య, స్వామి, వివో ఏలు, తదితరులు పాల్గొన్నారు

ఉపాధి హామీ పనులపై నేడు ప్రజావేదిక

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో నేడు (మంగళవారం) ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీపై ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఏపీవో సాయిలు తెలిపారు. 1.04.2023 నుండి 31.03.2024 వరకు ఉపాధి హామీ ద్వారా గ్రామాలలో చేసిన పనులపై ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సోయా కొనుగోళ్లలో అవకతవకలపై విచారణ జరిపించాలి

- ప్రజావాణిలో ఫిర్యాదు

నవతెలంగాణ-మద్నూర్



మద్నూర్ మార్కెట్ యార్డు లో సోయా కొనుగోళ్లలో అధికా రుల అవకతవకలపై విచారణ చేయించాలని మాజీ ఎంపీటీసీ కర్రేవారు రాములు కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. పంట సాగు చేసినా చేయకపోయినా సాగుచేసినట్లు నివేదికలు ఇవ్వడం లాంటి వాటిపై భూ సర్వే నిర్వహించి అమ్మకాలు జరిపిన వాటిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

మద్నూర్ ఆర్ఐ శంకర్‌కు ప్రశంస

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహించే ఆర్ఐ శంకర్‌కు గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రశంసాపత్రం అందుకున్నట్టు సిబ్బంది తెలిపారు. దీంతో తహసీల్దార్‌తో పాటు సిబ్బంది ఆయనను అభినందించారు.

జిల్లాస్థాయి ఉత్తమ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌కు సన్మానం



నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ తెలుగు మీడియం ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఎం.శ్రీనివాస్ ఇటీవల జిల్లా స్థాయి ఉత్తమ ప్రధానోపాధ్యాయుడు అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రధానోపాధ్యాయుల సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రవీందర్, లక్ష్మీ నరసయ్య, కుంట శ్రీనివాస్‌రెడ్డి, కవిత, చేతన కుమారి పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సిద్దులగుట్టపై ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని సిద్దులగుట్ట వద్ద గల శివాలయం, రామాలయం, దుర్గామాత, అయ్యప్ప ఆలయాలలో సోమవారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పట్టణతో పాటు కరీంనగర్, నిర్మల్, బైంసా, కామారెడ్డి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రామాలయం నుంచి కోనేరు వరకు, తిరిగి రామాలయం వరకు పల్లకి సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సుమన్, పిసి గంగారెడ్డి, ప్రశాంత్‌గౌడ్, చరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహతి ఆశ్రమానికి ఆర్థిక సహాయం అందజేత

నవతెలంగాణ-బాల్కొండ

జాతీయస్థాయిలో భారత సేవారత్న పురస్కారం అందుకున్న ఆర్మూర్‌కు చెందిన పట్వారి తులసి కుమార్ సోమవారం మండల కేంద్రంలోని మహతి ఆశ్రమానికి రూ.2000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనంతరం విద్యార్థులకు మహనీయుల చరిత్ర పుస్తకాలు అందజేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమ వ్యవస్థాపకులు పట్వారి తులసి కుమార్ వారి మాతృమూర్తి పట్వారి బాల సరస్వతిని ఘనంగా సన్మానించారు. అనంతరం ఆర్మూర్ రోటరీ క్లబ్ అధ్యక్షులుగా ఎన్నో సేవలు అందిస్తున్న పట్వారి గోపికృష్ణను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ వ్యవస్థాపకులు నిర్మల, నరేష్, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

అండర్-14 సాఫ్ట్‌బాల్ పోటీలకు తొర్లికొండ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ఇటీవల ఆర్మూర్, సుద్దపల్లిలో జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో జరిగిన సాఫ్ట్‌బాల్ అండర్-14 నిజామాబాద్ ఉమ్మడి జిల్లా ఎంపిక పోటీలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తొర్లికొండ విద్యార్థులు బాలుర విభాగంలో కొమిరె కిషోర్, పెండ్యాల నవనీత్ బాలికల విభాగంలో చిక్కాల శ్రీవర్షిని, గేడం వనజ, గంజి వరలక్ష్మి పాల్గొని చక్కని ప్రతిభ కనబరిచి ఈనెల 29 నుంచి 31 వరకు ఒలంపియాడ్ స్కూల్ తూప్రాన్, మెదక్ జిల్లాలో జరిగే 68వ స్కూల్ గేమ్స్ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అండర్-14 పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ మర్కంటి గంగామోహన్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన క్రీడాకారులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి ఎం.శ్రీనివాస్, ఉపాధ్యాయులు సాయిలు, రామకృష్ణ, గంగాధర్, డాక్టర్ నరసింహారావు, సునీత, కృష్ణ, మాలతి, పల్లె గంగాధర్, గౌతమి, ఓఎస్ శేఖర్ అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాను ప్రథమ స్థానంలో నిలపడానికి కృషిచేసి రాష్ట్ర జట్టులో స్థానం సాధించి జాతీయ పోటీలలో పాల్గొనాలన్నారు.

గోవింద్‌పేట్ సొసైటీలో రైతులకు పంట రుణాలు అందజేత



రైతులకు పంట రుణాలు అందజేత

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని గోవింద్ పెట్ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం యందు సోమవారం 32 మంది రైతులకు 26, 42, 500 లక్షల రూపాయల పంట రుణాలు అందజేసినట్టు సొసైటీ చైర్మన్ బంటు మహిపాల్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సొసైటీ వైస్ చైర్మన్, సీఈఓ, డైరెక్టర్ల, సిబ్బంది తదితరుల సమన్వయంతో సొసైటీ పరిధిలోని రైతులకు సేవలు అందజేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు లక్కారం నర్సింలు, గంగు, సీఈవో బొడ్డు రమేష్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

చిన్న మహిళా సంఘాలు గ్రామ మహిళా సంఘంలో పొదుపు పెంచుకోవాలి



మాట్లాడుతున్న బీజేపీ ఏపిఎం రవీందర్‌రెడ్డి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలో అన్ని గ్రామాలలో గల చిన్న మహిళా సంఘాలు స్థానిక గ్రామ మహిళా సంఘంలో పొదుపులు పెంచుకోవాలని ఐజేపి ఏపిఎం రవీందర్ రెడ్డి అన్నారు. మండలం కేంద్రంలో ఐకెపి కార్యాలయంలో మండల మహిళా సమైక్య సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రతి చిన్న సంఘం చిన్న మహిళా సంఘాల ఆర్థిక లావాదేవీలను ఆన్లైన్లో పొందపరచాలన్నారు. బ్యాంకు రుణాలు, శ్రీనిధి రుణాలు, గ్రామ సంఘం రుణాలు వినియోగించుకుని మహిళా సంఘం సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. చిన్న మహిళా సంఘాలు క్రమం తప్పకుండా సమావేశాలు ఏర్పాటు చేసుకుని సంఘాలను పటిష్టంగా ఉంచాలన్నారు. బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలు ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించాలని అన్నారు. మహిళా శక్తి కార్యక్రమాలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా సమైక్య ప్రతినిధులు, కమిటీ కోఆర్డినేటర్లు, మండల మహిళా సమైక్య సిబ్బంది, అన్ని గ్రామాల నుంచి వచ్చిన మహిళ గ్రామ సంఘం అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి వెల్లువెత్తిన ఫిర్యాదులు

- అర్జీలను సత్వరమే పరిష్కరించాలి
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. అర్జీలకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 225 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదు దారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ట్రైనీ కలెక్టర్ సంకేత్, డీఆర్డీఓ సాయాగౌడ్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, డీపీఓ శ్రీనివాస్, మెప్మా పీ.డీ రాజేందర్‌కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ అర్జీదారులకు సమాచారం తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

కార్మికులకు పారితోషకం ఇవ్వాలి



ధర్నా చేస్తున్న కార్మికులు, నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పిఎం పోషణ మినరల్స్ (రాగి జావ) నిర్వహణ కొరకు కార్మికులకు పారితోషకం ఇవ్వాలని సిపిఐ, ఏఐటియుసి డిమాండ్ చేసింది. నిజామాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జిజి కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి జిల్లా అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతనంగా తెచ్చిన పీఎం పోషణ మినరల్స్ జిల్లాలోని పాఠశాలల్లో రాగి జావా తయారు చేయడం కోసం రాగి జావా పౌడర్, బెల్లం పంపినప్పటికీ పాఠశాలల్లో విద్యార్థులకు రాగిజావ అందిస్తున్న విద్యార్థులకు మాత్రం ఎలాంటి పారితోషికం ఇవ్వడం లేదని అన్నారు. ఈ పథకం కోసం తెలంగాణలో 8 కోట్ల రూపాయలు నిల్వ ఉన్నందున నిర్వాకులకు నెలకు వెయ్యి రూపాయలు ఇప్పించాలని కోరుతున్నామన్నారు. మార్కెట్ ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని, ప్రతి విద్యార్థికి ఒక్కొక్కరికి 25 రూపాయలు చొప్పున స్లాబ్ రేట్ చెల్లించడంతోపాటు వంట కార్మికులకు తొలగించ కుండా జీవోను విడుదల చేయాలని వంట చేస్తున్న సందర్భంలో జరుగుతున్న ప్రమాదాలకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు పి.నర్సింగ్‌రావు, ఏఐటియుసి జిల్లా కార్యదర్శి హనుమాన్లు, యూనియన్ జిల్లా అధ్యక్షులు స్రవంతి, ప్రధాన కార్యదర్శి టి.చక్రపాణి, జిల్లా గౌరవ అధ్యక్షురాలు సాయమ్మ ధర్నాను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో గంగాధర్, శ్రీను, నాగలక్ష్మి, బుచ్చయ్య మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నిధులు కేటాయింపు హర్షణీయం

- రూరల్ ఎమ్మెల్యేకు రుణపడి ఉంటాం
- మండలాధ్యక్షులు మోత్కురి నవీన్‌గౌడ్, నాయకులు సంతోష్‌రెడ్డి, సుధాకర్



మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని ఏడు మండలాలకు మంజూరు చేసిన నిధులకు గానూ ఇందల్‌వాయి మండలానికి 21.92 కోట్లు నిధులు కేటాయించడంతో ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డికి రుణపడి ఉంటామని, ఇది శుభ పరిణామమని మండలాధ్యక్షులు మోత్కురి నవీన్‌గౌడ్, సంతోష్‌రెడ్డి, సుధాకర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత 10 ఏండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం హయంలో గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టకపోవడంతో ప్రజలు అనేక రకాలుగా ఇబ్బందులకు గురయ్యారని, ఇదే కాకుండా ప్రతి ఒక్కరికీ అవసరమున్న రేషన్ కార్డుల్లో మార్పులు చేర్పులు చేయలేక కాలం వెళ్లదీశారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులను అందజేస్తుందన్నారు. ఎన్నికల సమయంలో ఆనాటి పిసిసి అధ్యక్షుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి ప్రతి గ్రామంలో ప్రచారం నిర్వహించినప్పుడు ప్రజల స్థితిగతులను తెలుసుకొని అభివృద్ధి కోసం పలు హామీలు ఇచ్చారని, ఆ హామీల అమలులో భాగంగా 26న రాష్ట్ర ప్రభుత్వం నాలుగు పథకాలను ప్రారంభించిందన్నారు. ఇదే కాకుండా నియోజకవర్గానికి కోట్లాది రూపాయలు మంజూరు చేయించి అభివృద్ధికి ప్రత్యేక కృషి ఎమ్మెల్యే చేస్తున్నారని వారన్నారు. ఇందల్‌వాయి మండలానికి వచ్చిన మొత్తం నిధులు 21 కోట్ల 92 లక్షల 83 వేల రూపాయలు మంజూరయ్యాయని వారు వివరించారు. మండలంలోని అన్ని గ్రామాలలో సిసి రహదారులు కమ్యూనిటీ హాల్‌లు, ఇతర వాటికి నిధులను మంజూరు చేసినట్లు వారు పేర్కొన్నారు.

నిజామాబాద్ రూరల్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఉన్న అన్ని మండలాల కంటే ఇందల్‌వాయి మండలానికి అత్యధికంగా నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డికి మండల కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలుపుతున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో తిర్మన్‌పల్లి మాజీ ఎంపిటిసి జంగిలి లక్ష్మీ, డాక్టర్ సామల రాజేష్, కర్స మోహన్, నారాయణ్ నాయక్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హెచ్‌ఐవి రోగుల వివరాలు గోప్యంగా ఉంచుతాం

- కిశోర బాలికలకు మొబైల్స్ ఇవ్వొద్దు
- వర్ద్ స్వచ్ఛంద సంస్థ కమ్యూనిటీ కోఆర్డినేటర్ సుజాత



మాట్లాడుతున్న వర్ద్ స్వచ్ఛంద సంస్థ కమ్యూనిటీ కోఆర్డినేటర్ సుజాత

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

హెచ్‌ఐవి రోగుల వివరాలు గోప్యంగా ఉంచుతామని, కిశోర బాలికలకు మొబైల్ ఇవ్వవద్దని వర్ద్ స్వచ్ఛంద సంస్థ కమ్యూనిటీ కోఆర్డినేటర్ సుజాత అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మండల సమాఖ్యలో మండల సమైక్య ఈసీ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వర్ద్ స్వచ్ఛంద సంస్థ కమ్యూనిటీ కోఆర్డినేటర్ హాజరై మహిళా సంఘం సభ్యులకు అవగాహన కల్పించారు. కుటుంబంలో భార్య భర్తలు సంతోషంగా ఉండాలంటే కోపం అనేటువంటి విషయాన్ని పక్కకు పెట్టాలని అన్నారు. కోపంతో కొంపలు మునిగిపోతాయని తెలిపారు. కిశోర బాలికల పట్ల తల్లిదండ్రులు బాధ్యతగా వహించి కౌమార దశలో బాలికలలో శారీరక మార్పులు వస్తాయన్నారు. మార్పులు వస్తున్న సమయంలో తల్లి జాగ్రత్తగా విషయాలను తెలియజేయాలన్నారు. బాలికలకు సరైన జ్ఞానాన్ని అందించాలని సూచించారు. విద్యార్థినిలు హాలిడేస్‌లో ఇంటికి వస్తూ ఉంటారని, టీనేజీ అమ్మాయిలకు 13, 14, 15, 16 సంవత్సరాల్లో అతి జాగ్రత్తగా ఉండే విధంగా తల్లి అన్నీ సూచనలు ఇవ్వాలన్నారు. మొబైల్‌లో మంచి, చెడు విషయాలు ఉంటాయని, అందువల్ల పిల్లలకు మొబైల్ ఇవ్వకపోవడం చాలా మంచిదన్నారు.

అన్ని రోగాల సమూహమే ఎయిడ్స్..

అన్ని రోగాల సమూహమే ఎయిడ్స్ అని వర్ద్ స్వచ్ఛంద సంస్థ కమ్యూనిటీ కోఆర్డినేటర్ సుజాత అన్నారు. భార్యాభర్త కాకుండా ఇతర వ్యక్తులతో శిక్షల్లో పాల్గొనేటప్పుడు హెచ్‌ఐవి వస్తుందన్నారు. హెచ్‌ఐవి మానవ శరీరంలో 10 సంవత్సరాల వరకు రక్తంలో ఉంటుందన్నారు. 10 సంవత్సరాలు రక్తంలోని వైరస్ బయటకు వచ్చి అనారోగ్యాల పాలు అవుతారన్నారు. అటువంటి వారికి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా మందులు అందజేస్తారని తెలిపారు. హెచ్‌ఐవి రోగులకు ప్రభుత్వం ద్వారా పెన్షన్ వచ్చే అవకాశం ఉందన్నారు. హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులు వ్యాధి నిరోధక శక్తి తగ్గి శక్తి హీనులుగా మారడంతో వారి పనులు వారు చేసుకోలేని పరిస్థితికి చేరుకుంటారని, ప్రభుత్వం ఇచ్చే ఉచిత మందులతోనే వారి పని చేయలేరని వారికి మందులతో పాటు న్యూట్రిషన్ ఫుడ్ తీసుకుంటే వారు ఎక్కువ కాలం బతికే అవకాశం ఉందన్నారు. వర్ద్ స్వచ్ఛంద సంస్థ ద్వారా న్యూట్రిషన్ ఫుడ్ అందించే విధంగా సపోర్ట్ చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల సమైక్య ప్రతినిధులు ఏపీఎం రవీందర్‌రెడ్డి, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, మండల సమైక్య సిబ్బంది, అన్ని గ్రామాల నుంచి వచ్చిన గ్రామ సంఘం అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక శాఖ మంత్రిని వెంటనే నియమించాలి



అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే కార్మిక మంత్రిని నియమించాలని డిమాండ్ చేస్తూ ట్రేడ్ యూనియన్స్ సెంటర్ ఆఫ్ ఇండియా (టియుసిఐ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా టియుసిఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ముత్తెన్న, ఎం.సుధాకర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు అవుతున్నా, ఇప్పటికీ కార్మిక మంత్రిని నియమించలేదన్నారు. కార్మిక శాఖను ముఖ్యమంత్రి వద్దే ఉంచుకోవడంతో కార్మికుల సమ్యస్యలు, వారి న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం కార్మిక సంఘాల నాయకులు ముఖ్యమంత్రిని కలవడానికి ప్రోటోకాల్ సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. తద్వారా అనేక సమస్యలు పెండింగులో ఉంటున్నాయని వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి తమ రోజువారి బిజీ షెడ్యూల్ వల్ల కార్మిక శాఖపై దృష్టి పెట్టలేకపోతున్నారన్నారు. ఇందువల్ల ప్రభుత్వానికి కూడా అప్రతిష్ట వస్తున్నదన్నారు. కార్మికులకు అన్యాయం జరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి వెంటనే కార్మిక శాఖ మంత్రిని నియమించాలని, కార్మిక శాఖ సమీక్ష సమావేశం నిర్వహించి, పెండింగులో ఉన్న డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీయుసిఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.నరేందర్, జిల్లా ఉపాధ్యక్షులు ఎం.వెంకన్న, డి.రాజేశ్వర్, జిల్లా సహాయ కార్యదర్శి ఆర్.రమేష్, జిల్లా నాయకులు కిషన్, మురళి, విటల్, కిరణ్, రవి తదితరులు పాల్గొన్నారు.

నిరాటంకంగా, నాణ్యమైన విద్యుత్ సరఫరా

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రానున్న వేసవిలో నిరాటంకంగా, నాణ్యమైన విద్యుత్ సరఫరాను అందించడానికి నోడల్‌స్థాయి అధికారులు రాష్ట్రవ్యాప్తంగా క్షేత్ర స్థాయిలో పర్యటనలు చేయాలని ఇటీవల డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఆదేశించారు. ఈ క్రమంలో రానున్న వేసవిలో మెరుగైన విద్యుత్ అందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని గౌరవ ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశానుసారం నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ పరిధిలోని 16 జిల్లాల్ల పరిధిలో నియమించిన నోడల్ అధికారులు తమ పరిధిలోని అన్ని జిల్లాలను ఈ నెల 29-1-2025 రోజున నుంచి పర్యవేక్షించనున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 29-1-2025 రోజున వేసవి కాలానికి సంబంధించి విద్యుత్ కార్యాచరణ ప్రణాళిక (సమ్మర్ యాక్షన్ ప్లాన్)పై సమీక్షా సమావేశాన్ని నిజామాబాద్ సర్కిల్ నోడల్ అధికారి బి.అశోక్, సి.ఈ, ఆపరేషన్ చేపడతారు. ఈ సమావేశంలో ప్రతి జిల్లా నోడల్ అధికారి తన పరిధిలోని ట్రాన్స్కో అధికారి, సర్కిల్ ఎస్ఈ సమక్షంలో సర్కిల్ పరిధిలోని సంబంధిత సర్కిల్ అధికారులతో సర్కిల్ కార్యాలయంలో సమీక్షా నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో పురోగతిలో ఉన్న పనులు, ఇంకను చేపట్టవల్సిన పనులపై సమీక్షా నిర్వహించి మార్గనిర్దేశనం చేయనున్నారు.


అంతర్జాతీయ సాహిత్య బహుమతులు అందుకున్న ఏర్గట్ల విద్యార్థులు



నవతెలంగాణ-ఏర్గట్ల

ఏర్గట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అంతర్జాతీయ సాహిత్య బహుమతులను అందుకున్నారు. కెనడా దేశం కేంద్రంగా గడుగ్గాయి అంతర్జాతీయ పత్రిక నిర్వహించిన కథలు, కవితల పోటీల్లో ఏడవ తరగతి చదువుతున్న వేముల రూపక్, పెరక రాజేష్, నవదీప్ రాసిన కవితలకు ఉత్తమ బహుమతులు, శ్రీనిధి, అశ్విని, అభిలాష్, రిశ్వంత్, వైష్ణవి రాసిన కథలకు, కవితలకు ప్రోత్సాహక బహుమతులు వచ్చాయని, పదవ తరగతి విద్యార్థి ఆస్నిహ భాను రాసిన కథకు ఉత్తమ కథా బహుమతి వచ్చిందని తెలుగు పండితులు ప్రవీణ్‌శర్మ తెలిపారు. వీరికి ప్రశంసాపత్రాలను, నగదు బహుమతిని అందజేసినట్లు తెలిపారు. పాఠశాల పేరు నిలబెట్టిన విద్యార్థులను, ప్రధానోపాధ్యాయులు కృష్ణాచారి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఏకీకృత పెన్షన్స్ స్కీమ్‌ను రద్దు చేయాలి



వినతిపత్రాన్ని అందజేస్తున్న పీఆర్టీయు నాయకులు

నవతెలంగాణ-ధర్పల్లి

కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన ఏకీకృత పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేయాలని పిఆర్టియు మండలాధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వెంకట రాజారెడ్డి సతీష్ అన్నారు. సోమవారం డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్, ఎంపీడీవో బాలకృష్ణకు వినతిపత్రాన్ని అందజేశారు. పీఆర్టీయూ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు కేంద్ర ప్రభుత్వం 01.04.2025 నుంచి యూపీఎస్ (ఏకీకృత పెన్షన్ స్కీమ్)ను అమలు చేయనున్న సందర్భంగా మన రాష్ట్ర ప్రభుత్వం కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని సీపీఎస్ నుంచి యూపీఎస్‌కు కాకుండా సీపీఎస్‌ను రద్దు చేసి నేరుగా పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ధర్పల్లి పీఆర్టీయూ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వెంకట్రాజరెడ్డి, సతీష్, అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అంకం నరేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రవిరాజ్, పిఆర్‌టియు మండల బాధ్యులు నవీన్ రామ్, సంతోష్, ఠాకూర్ దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంస

నవతెలంగాణ-భీంగల్ రూరల్


ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న గంగలలిత

మండలంలోని పల్లికొండ గ్రామంలో క్లస్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సిసి గంగలలిత జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకున్నారు. మహిళా సంఘాలకు బ్యాంకు వివరాలు, శ్రీనిధి రుణాలు అందిస్తూ అన్ని ఆదాయాభివృద్ధి కార్యక్రమాలలో మహిళా సంఘాలకు తోడ్పాటు అందిస్తూ న్యూఎంటర్ప్రైజెస్ 100శాతం మహిళా సంఘాలకు అందించడంలో కీలకపాత్ర పోషించినందుకు ఉత్తమ అవార్డు కలెక్టర్ చేతులమీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఉత్తమ సిసిగా అవార్డు అందుకున్న గంగా లలితను ఐకేపీ, ఏపీఎం రవీందర్, సీసీలు, వివోఏలు, గ్రామ సంఘ అధ్యక్షురాలు, తదితరులు అభినందించారు.

కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలను అందుకున్న ప్రభుత్వాధికార దంపతులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి


ప్రశంసాపత్రాలతో ప్రభుత్వాధికార దంపతులు

కలెక్టర్ చేతుల మీదుగా ప్రభుత్వాధికార దంపతులు ఆదివారం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు చేతుల మీదుగా ప్రశంసాపత్రాలను అందుకున్నారు. మండల కేంద్రంలో ఐకెపి కార్యాలబ యంలో పనిచేస్తున్న బుఖ్య రాములు, జక్రాన్‌పల్లి క్లస్టర్‌లో మహిళా సంఘాలకు అన్ని విధాలుగా బ్యాంకు రుణాలు, శ్రీనిధి రుణాలు 100 శాతం రుణాలు అందించి టార్గెట్‌ను పూర్తి చేశారు. అదేవిధంగా డిచ్‌పల్లి మండలం గ్రేడ్ వన్ అంగన్వాడీ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న ముఖ్య బుజ్జి డిచ్‌పల్లి సెక్టార్‌లో నడ్పిల్లి క్లస్టర్ పనిచేస్తూ, ధర్పల్లి మండలంలోని సెక్టర్లు విధులు నిర్వహిస్తూ ఇరువురు భార్యాభర్తలు కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలను అందుకున్నారు. వీరిని సంబంధిత శాఖ అధికారులు అభినందించారు.

వైద్యం ఎలా అందుతుంది..?

- ఆస్పత్రిలో సదుపాయాలు ఉన్నాయా..
- ఆస్పత్రులను సందర్శించిన కేంద్రబృందం

నవతెలంగాణ-లింగంపేట్/తాడ్వాయి



లింగంపేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద కేంద్ర బృందం

లింగంపేట్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పీఆర్‌సీ కేంద్ర బృందం సభ్యులు సోమవారం పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి అందుతున్న వైద్య సేవలు, ఇంకా అందాల్సిన సేవలును ఆరా తీశారు. గ్రామీణ ప్రాంతంలో సీజనల్ వ్యాధులు వ్యాధుల పట్ల వైద్య సేవలు, ఏ విధంగా సేవలందించారో అడిగి తెలుసుకున్నారు. రోజువారీగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఎంత మంది రోగులు వస్తున్నారు.? ఏ రకాల రోగులు వస్తున్నారు..? ఎన్ని మందులు అందుబాటులో ఉన్నాయో రికార్డులను తనిఖీ చేశారు. వైద్య సేవలపై వైద్యాధికారి డాక్టర్ హిమబిందు కేంద్ర బృందానికి వివరించారు. అదేవిధంగా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైనటువంటి వివరాలను వారు సంబంధిత వైద్యులు అడిగారు నివేదికను కేంద్ర వైద్య ఆరోగ్య శాఖకకు సమర్పించనున్నట్లు తెలిపారు. కేంద్ర బృందంలో డాక్టర్ సస్ డాక్టర్ ఏజే ఫ్రాన్సిస్ జావీర్, జిల్లా ఎస్ హెచ్ ప్రోగ్రాం అధికారి పద్మజ, ఫరీద, యాదగిరి సుభాష్ ప్రదీప్ గీత సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్పత్రిని సందర్శించిన పీఆర్‌సీ బృందం

తాడ్వాయి : మండలంలోని ఎర్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పి ఆర్ సి బృందం సోమవారం సంద ర్శించినట్టు వైద్యాధికారిని అజ్జి మమ్ తెలిపారు. పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ చీఫ్ అసిస్టెంట్ ఫ్రాన్సిస్ రోగులకు అందిస్తున్న వైద్య సేవ లు ఆసుపత్రిలో చేపడుతున్న కుటుంబ నియంత్రణ పాటించిన వారి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, డాక్టర్ ఖాసిం, ఏఎన్ఎంలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

- మండల వ్యవసాయ అధికారి నిశిత

నవతెలంగాణ-పోతంగల్

కొత్తగా పట్టాపాస్‌బుక్ పొందిన వారు రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి నిశిత, వ్యవసాయ విస్తరణ అధికారి సుప్రియ తెలిపారు. రైతు భరోసా కోసం కొత్తవారు భూభారతి (ధరణి) పాసుబుక్, ఆధార్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్‌లను అప్లికేషన్ ఫారానికి జతచేసి జనవరి 30 వరకు వారికి అందజేయాలన్నారు. గతంలో రైతుబంధు వచ్చిన రైతులు, రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు.

వరి పంటలను పరిశీలించిన మండల వ్యవసాయాధికారి

- కాండం తొలుచు పురుగు గుర్తింపు.. నివారణకు సూచనలు

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్గట్ల మండల వ్యవసాయాధికారి వైష్ణవ్ సోమవారం వరి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ.. వరి నాటి 20 రోజులు అయిన పొలాల్లో కాండం తొలచు పురుగు ఉధృతిని ఎక్కువగా గమనించినట్టు తెలిపారు. దీని నివారణకు కార్బోఫురోన్ 3జీని 10 కిలోలు ఎకరాకు లేదా క్లోరాన్ట్రోనిలిప్రోల్ 0.4 జీ 4కిలోలు ఎకరాకు వాడుకోవాలని రైతులకు సూచించారు. ఏఈఓలు సాయిసచిన్, మనీషా ఆయన వెంట ఉన్నారు.

మండలానికి రూ.12 కోట్ల 25 లక్షల నిధులు

- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి ధన్యవాదాలు
- కాంగ్రెస్ మండలాధ్యక్షులు ఆర్మూర్ చిన్న బాలరాజ్


మాట్లాడుతున్న చిన్న బాలరాజ్

నవతెలంగాణ-ధర్పల్లి

మండలానికి రూ.12 కోట్ల 25 లక్షల నిధులు అభివృద్ధి పనులకు మంజూరయ్యాయని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాలరాజ్ అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. మండలంలోని సుమారు అన్ని గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజల తరపున రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో సొసైటీ చైర్మన్ చెలిమెల మల్లికార్జున్, మంగిత్యా నాయక్, అబ్దుల్ హమీద్, అబ్దుల్ అజీజ్, చెలిమెల శ్రీనివాస్, పోత రాజు, బొక్కల బాలయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మా స్థలం మాకు ఇప్పించండి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నగరంలోని సర్వే నెంబర్ 2164కు సంబంధించిన ఎకరం స్థలాన్ని కొందరు భూ కబ్జాదారులు కబ్జా చేస్తున్నారని, ఆ స్థలాన్ని కొన్ని సంవత్సరాలుగా తాము ఆధీనంలో ఉన్నామని, ఇప్పటికే కొన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేశామని అయినా ఎటువంటి స్పందన లేకపోవడంతో సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్టు సయ్యద్ నీమత్ తెలిపారు. కబ్జాదారులపైన చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

బిజెవైఎం పానుగంటి సతీష్‌రెడ్డి



నవతెలంగాణ-డిచ్‌పల్లి

ప్రతి క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, ఓడినా.. ఆత్మవిశ్వాసంతో మున్ముందు జరిగే పోటీల్లో మంచి నైపుణ్యం ప్రదర్శించి గెలవాలని బిజెవైఎం జిల్లా అధ్యక్షులు పానుగంటి సతీష్ రెడ్డి అన్నారు. డిచ్‌పల్లి మండలంలోని సుద్ధపల్లి గ్రామంలో గత పది రోజులుగా ఫ్రెండ్స్ క్రికెట్ మేనేజ్మెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పానుగంటి సతీష్‌రెడ్డి బహుమతులను సోమవారం ప్రదానం చేశారు. టోర్నమెంట్‌కు మొదటి రెండవ బహుమతి స్పాన్సర్ చేసిన సుద్ధపల్లి గ్రామ యువకుడు పిట్ల క్రాంతి కుమార్‌కు సన్మానించారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వహకులు పవన్, విజయ్, రాజు, వినోద్‌రెడ్డి, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

జీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని జీజీ ఫౌండేషన్ కార్యాలయంలో ఇటీవలే పెర్కిట్ విడిసి నూతన అధ్యక్షునిగా ఎన్నికైన క్షత్రియ ముద్దు బిడ్డ పెర్కిట్ వాస్తవ్యులు బచ్చేవాల్ భోజరాజ్ సోమవారం జిజి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి ఆత్మీయ శుభాకాంక్షలు తెలిపినట్టు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ నివేదన్ గుజరాతి అన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు మాట్లాడుతూ మొట్టమొదటి సారిగా క్షత్రియ కులానికి ఇట్టి అధ్యక్ష పదవీ రావడం చాలా గొప్ప విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ ఆదర్శ్ మాజీ అధ్యక్షులు డీజే దయానంద్, సీనియర్ సిటిజన్ అధ్యక్షులు నారాయణ వర్మ, జిజి ఫౌండేషన్ ప్రతినిధులు అల్జాపూర్ రాజేశ్వర్, బేల్దారి శ్రీనివాస్, బొచ్కర్ వేణు, డీజే కాశీనాథ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక చేయూత

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని మంగల్‌పహాడ్ గ్రామపంచాయతీలో ట్రాక్టర్ డ్రైవర్‌గా విధులు నిర్వహించిన గరిగింట్ల శ్రీనివాస్ ఈనెల 16న అనారోగ్యంతో మృతి చెందడంతో గ్రామ పెద్దలు, యువకులు, ఉద్యోగులు, గ్రామ అభివృద్ధి కమిటీ పెద్దలు మృతి చెందిన శ్రీనివాస్ కుటుంబానికి అండగా నిలిచి సుమారు రూ.87వేలు నగదును సోమవారం అందజేశారు. అంతకుముందు గ్రామ పెద్దలు శ్రీనివాస్ మృతి పట్ల రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం వ్యక్తం చేశారు.

గంగాదేవి విగ్రహ ప్రతిష్ఠాపనకు హాజరుకావాలి

నవతెలంగాణ-ఎడపల్లి

మండల కేంద్రంలోని పులిచెరువు కట్టపై నూతనంగా నిర్మించిన గంగాదేవి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి గ్రామ పెద్దలు, మహిళలు, యువకులతో పాటు, అన్ని కుల సంఘాల పెద్దలు, సంఘం సభ్యులు తప్పకుండా హాజరుకావాలని గంగపుత్ర సంఘం సభ్యులు కోరారు. ఫిబ్రవరి 1 నుంచి 3 వరకు గంగమ్మ గుడి వద్ద దేవి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం, యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, ఓడిబియ్యం, బోనాల ఊరేగింపు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం సభ్యులు జగ్గరి నరేందర్, మచ్కూరి మోహన్, ఏనుగు శ్రీనివాస్, మాదిగ దండోరా సంఘం సభ్యులు పి.సాయి చిరు, బొపురం అబ్బులు, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

- బీఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు షాహిద్ డిమాండ్

నవతెలంగాణ-బాల్కొండ

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన సంక్షేమ పథకాల హామీల అమలులో మండలానికి ఒకటే ఊరుని ఎంచుకోవడం ఎంతవరకు సమంజసమని బీఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు షాహిద్ ప్రశ్నించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల అమలుకు మండలానికి ఒకే ఊరు అనుకుంటూ పోతే కాంగ్రెస్ ప్రభుత్వ కాలం వెళ్లదీస్తుందని, మిగిలిన నాలుగు సంవత్సరాలు అయినా హామీలు అమలు కావన్నారు. కాలయాపన చేయకుండా ఇచ్చిన హామీలు వెంటనే ప్రతి గ్రామానికి అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూడాలని డిమాండ్ చేశారు. లేకుంటే రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు సరైన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు.

పిడిఎస్‌యూ ఐక్యత సభను జయప్రదం చేయండి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నేడు ఖమ్మంలో జరిగే పిడిఎస్‌యూ రాష్ట్ర కార్యవర్గ ఐక్యత సభను జయప్రదం చేయాలని తెలంగాణ యూనివర్సిటీ పిడిఎస్‌యూ నాయకుడు అక్షయ్ విద్యార్థి లోకాన్ని కోరారు. సోమవారం తెలంగాణ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ముందు ఐక్యత కరపత్రాలను పిడిఎస్‌యూ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పిడిఎస్‌యూ ఉస్మానియా యూనివర్సిటీలో పురుడోసుకొని నేడు దేశవ్యాప్తంగా పీడిత విద్యార్థుల పక్షాన పోరాడుతుందని వివరించారు. గత 50 సంవత్సరాల సుదీర్ఘ పోరాట వారసత్వం పిడిఎస్‌యూ సొంతమన్నారు. రాజ్యం పాలక ప్రభుత్వాలు ఎంతటి నిర్బంధం ప్రయోగించినా ఎప్పటికప్పుడు వాటికి సవాలు విసురుతూ తన ప్రత్యేకతను చాటుకుంటూనే ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీయూ పి.డి.ఎస్.యూ నాయకులు దేవిక, బిందు, నిఖిల్, రాజేందర్, ఆకాష్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ జూనియర్ అసిస్టెంట్ అవార్డు గ్రహీతకు సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్



జూనియర్ అసిస్టెంట్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఆలూర్ మండల కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న స్వాతి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ జూనియర్ అసిస్టెంట్ అవార్డును రిపబ్లిక్ డే రోజు అందుకున్నారు. ఈ సందర్భంగా వారిని సోమవారం బిజెపి మండల మాజీ అధ్యక్షుడు కొత్తూరు గిరీష్ సన్మానించారు. ఉద్యోగులు తమ వంతు సేవలు అందించి ప్రజల మన్ననలు అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలూరు ఎమ్మార్వో రమేష్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రఫిక్, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామానికి రుణపడి ఉంటా

- మున్నూరు కాపులందరం ఐక్యమత్యంగా ఉందాం
- మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలితకు ఘన సన్మానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి


ఆకుల లలిత దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

గ్రామం నాటి నుంచి నేటి వరకు అన్ని విధాల సహాయ సహకారాలను అందజేసిందని, ఎల్లప్పుడూ గ్రామానికి మున్నూరు కాపు సంఘానికి రుణపడి ఉంటానని, మున్నూరు కాపులందరూ ఐక్యమత్యంతో ఉంటూనే రాజకీయంగా ఎదగాలని మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత రాఘవేందర్ అన్నారు. సోమవారం ఇందల్‌వాయి మండలంలోని సంస్థాన్ సిర్నపల్లి గ్రామంలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో మున్నూరు కాపు (పటేల్) ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఆకుల లలిత రాఘవేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2008లో డిచ్‌పల్లి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఉప ఎన్నికల్లో నిలిచి నియోజకవర్గ ప్రజలు భారీగా ఓట్లువేసి గెలిపించారన్నారు. ఆనాడు ఉన్న తొమ్మిది నెలల కాలంలోనే నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో అభివృద్ధి పనులకు నిధులను మంజూరు చేయడంతో పాటు సిర్నపల్లిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం శాయశక్తులా కృషి చేసి పూర్తి చేసినట్టు వివరించారు. అది ఎంతగానో ఆనందంగా అనిపించిందని, శీలం జానకిబాయి సిర్నపల్లి గ్రామానికి ఎంతగానో ఆనాడు కృషి చేసిందన్నారు. మున్నూరు కాపుల కళ్యాణ మండపానికి నిధులను మంజూరు చేయించానని, సిర్నపల్లి గ్రామానికి రాబోయే రోజులలో అభివృద్ధి కోసం తన వంతు సహాయ సహకారాలను అందజేస్తూ నిధులు మంజూరుకు కృషి చేస్తానని చెప్పారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో మున్నూరు కాపులు మెజార్టీగా ఉన్నచోట కాపు సామాజిక వర్గానికి సంబంధించిన వ్యక్తులకు మద్దతునిచ్చి గెలిపించే విధంగా చూడాలని అన్నారు. మున్నూరు కాపులు వ్యవసాయంపైనే ఆధారపడి ఉంటారని, వారిలో కొందరు రాజకీయాలు, ఇంకొందరు ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో నలభై రెండుశాతం రిజర్వేషన్లు కల్పించే అవకాశం ఉందని, దానిని మున్నూరు కాపులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆత్మీయ సమ్మేళనం పేర కనీవినీ ఎరుగని రీతిలో గ్రామానికి చెందిన మున్నూరు కాపు సంఘానికి రుణపడి ఉంటామని తెలిపారు. రానున్న రోజులలో మున్నూరు కాపు సంఘానికి ప్రహరీ గోడ నిర్మించే సమయంలో తన వంతు సహాయం ఉంటుందని వివరించారు. అంతకుముందు మాజీ ఐడిసిఎంఎస్ చైర్మెన్ సాంబార్ మోహన్, డిచ్‌పల్లి మాజీ ఎంపిపి కంచెట్టి గంగాధర్, ఎల్‌ఐసి గంగాధర్, రేలారే రేలా ఫేమ్ గంగతో పాటు తదితరులు మాట్లాడారు. అనంతరం అతిథులకు గజమాలతో ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు మోతె రాజు, న్యావనంది సాయిలు, తిరుపతి, రాజ్‌కుమార్, సాంబార్ విటల్, ధర్పల్లి ప్రభాకర్, బైరయ్య, శేఖర్, అరేపల్లి దశరథ్, గట్టు కడారి, శ్రీకాంత్, పులి సాగర్, కాదు రవి, చుక్క బోట్ల రాజయ్య, ర్యాల గంగాధర్, ర్యాల రాధిక, సరితా, తేలు గంగాధర్, అకుల సాయిలు, పెంటయ్య, రవి, భూమేష్, వకీల్ రాజన్న, చుక్కబొట్ల గంగవ్వ, మానస తదితరులు పాల్గొన్నారు.

పెండింగులో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మోడల్ స్కూల్ హాస్టల్స్ నాన్ టీచింగ్ సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే ఇప్పించాలని, కేజీబీవీ సిబ్బందికి ఇస్తున్న పద్ధతిలోనే వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్, వర్కర్స్ యూనియన్ (టియుసిఐ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, ప్రజావాణిలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లాలో ఉన్న మోడల్ స్కూల్ హాస్టళ్లల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్, వర్కర్లకు గత 5 నెలలుగా వేతనాలు రావడం లేదన్నారు. ఇందుకు సంబంధించి జిల్లా విద్యాశాఖలో బడ్జెట్ ఉన్నా, వీరికి వేతనాలు ఇవ్వక పోవడం బాధాకరమన్నారు. ఇప్పటికే వీరికి అతి తక్కువ వేతనాలు ఉన్నాయనీ, అవి కూడా నెలల తరబడి రాకపోవడంతో వారి కుటుంబాల పోషణ భారంగా మారిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మోడల్ స్కూల్ హాస్టల్స్‌ను కేజీబీవీ హాస్టల్స్‌గానే పరిగణిస్తున్నారన్నారు. కానీ వీరికి కేజీబీవీ తరహాలో వేతనాలు రావడం లేదన్నారు. ఇప్పటికైనా కేజీబీవీ సిబ్బందికి ఇస్తున్న పద్ధతిలోనే మోడల్ స్కూల్ నాన్ టీచింగ్, వర్కర్లకు పేరోల్ కేటాయించి, వేతనాలు ఇవ్వాలన్నారు. వారు ఇతర సమస్యలు పరిష్కరించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టియుసిఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.నరేందర్, జిల్లా అధ్యక్షులు ఎం.ముత్తెన్న, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు డి.ప్రశాంతి, నాయకులు రజియాబేగం, హారిక, స్వర్ణలత, సత్యశీల, మమత, వాణి, మానస, చిట్టి, సుచేంద్ర, గంగాదేవి, వెంకన్న, రాజేశ్వర్, రమేష్, కిషన్, మురళి పాల్గొన్నారు.

చర్చిలో అక్రమాలపై విచారణ జరిపించాలి

నవతెలంగాణ-ఆర్మూర్

సిఎస్ఐ చర్చిలో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపించాలని జిల్లా కలెక్టర్, ఆర్డీవోలకు ఫిర్యాదు చేసినట్లు చర్చి సభ్యులు రాపల్లి బాబీ ప్రసాద్ అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్ భవనంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిఎస్ఐ చర్చిలో పాస్టర్ మన్నె శ్రీనివాస్, ప్రభు కిరణ్‌లల్లుతో కుమ్మక్కై అక్రమాలకు పాల్పడ్డారన్నారు. చర్చి నిర్మాణానికి రూ.కోటి ఖర్చయినట్లు చెప్పడంతో నిర్మల హృదయను ప్రశ్నిస్తే సభ్యునిగా తొలగించారని పేర్కొన్నారు. ఈమధ్య స్టాలిన్ అనే వ్యక్తి నన్ను చంపివేస్తానని బెదిరిస్తున్నందున పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఎస్సీలుగా కొనసాగుతూ ఉద్యోగాలు చేస్తూ పాస్టర్‌గా ఉంటూ లబ్ధి పొందుతున్న విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

వేల్పూర్ మండలంలోని పచ్చల నడకుడలో ఉపాధ్యాయునిగానున్న జూల దేవానంద్ బాల్కొండలో చర్చిలను ఏర్పాటు చేసి పాస్టర్‌గా కొనసాగుతున్నందున తన ఫిర్యాదు మేరకు విచారణ జరిపి సస్పెండ్ చేశారని చెప్పారు. ఎస్సీ కులస్తులుగా కొనసాగుతూ చర్చిలలోని పదవులలో కొనసాగుతున్నారన్నారు. క్రైస్తవేతరులు 80 శాతం మంది ఎస్సీ సర్టిఫికెట్లు పొంది రెండు విధాలుగా లబ్ధి పొందడం వల్ల క్రైస్తవులకు అన్యాయం జరుగుతుందని ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్, ఆర్డీవో విచారణ జరిపి నిజమైన క్రైస్తవులకు అన్యాయం జరగకుండా చూడాలన్నారు. తనను చంపి వేస్తానని బెదిరిస్తున్న స్టాలిన్‌పై పోలీసులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఉర్దూ భాషలో లోతుగా పరిశోధనలు జరిపి
వర్సిటీకి గుర్తింపు తీసుకురావాలి

- అబ్దుల్ ఖవి అవార్డు రావడం సంతోషదాయకం
- వైస్ ఛాన్సలర్ టి.యాదగిరిరావు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఉర్దూ విభాగంలో పరిశోధన రంగంలో మరింతలోతుగా పరిశోధనలు జరిపి యూనివర్సిటీకి గుర్తింపు తీసుకురావాలని వైస్ ఛాన్సలర్ టి.యాదగిరిరావు అన్నారు. తెలంగాణ యూనివర్సిటీ ఉర్దూ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ మహమ్మద్ అబ్దుల్ ఖవికి ప్రతిష్టాత్మక రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉర్దూ అకాడమీ చే పరిశోధన-విమర్శ రంగంలో లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డు అందుకోవడం అభినందనీయమని తెలిపారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ టి.యాదగిరిరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.యాదగిరి, డాక్టర్ మహమ్మద్ అబ్దుల్ ఖవిని సోమవారం యూనివర్సిటీలో శాలువాతో ఘనంగా సన్మానించారు. అబ్దుల్ ఖవి ఈ ప్రతిష్టాత్మక లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డు అందుకోవడంతో తెలంగాణ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (టూటా) అధ్యక్షులు డాక్టర్ ఏ.పున్నయ్య, ప్రధాన కార్యదర్శి డాక్టర్ మోహన్ బాబు, ఉపాధ్యక్షులు డాక్టర్ సత్యనారాయణ రెడ్డి, కోశాధికారి డాక్టర్ నాగరాజ్, డాక్టర్ జమీల్, డాక్టర్ వాసం చంద్రశేఖర్, డాక్టర్ బాలకిషన్, డాక్టర్ నీలిమ, ఇతర అధ్యాపకులు, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు అభినందనలు తెలిపారు.